తెలుగు దినపత్రిక
# సిరి
People's Voice వార్త పత్రిక
RNI TG TEL/ 26/A0381
07-06-2026
ఆదివారం హైదరాబాద్
సంపుటి: (volume): 1
సంచిక: (ISSUE): 121
PUBLISHED FROM HYDERABAD పేజీలు-8 వెల:రూ.4 /–

తెలుగు దినపత్రిక
www.siridaily.com
సిరి
People's Voice వార్తపత్రిక
RNI:TGTEL/26/A0381
siridailynews@gmail.com
/siridailynews
@siridailynews
epaper.siridaily.com
విలేకరులు కావలెను
ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న సిరి దినపత్రిక లో తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్ తో పాటు, అన్ని జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు మరియు మండలాలకు విలేకరులు కావలెను.
99897 78881, 7702344303, 9440451575






సిరి ఎఫెక్ట్

## పటాన్‌చెరు ఏఈ రామకృష్ణ

# అవినీతిపై కొరడా..!

- 'సిరి' కథనంతో కదిలిన యంత్రాంగం
- రూరల్ సెక్షన్‌లో మూడేళ్లుగా వేసిన సాంకేతిక అంచనాలపై దర్యాప్తునకు ఆదేశాలు
- టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి పాటిల్ దృష్టికి అవినీతి వ్యవహారం
- రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపిన 'రామ 'కృష్ణ' లీలలు' కథనం
- 'సిరి' పత్రికకు బాధితుల కృతజ్ఞతలు

**సంగారెడ్డి, సిరి న్యూస్:** సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు రూరల్ సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) రామకృష్ణ అవినీతి వ్యవహారంపై విద్యుత్ శాఖ యంత్రాంగం తీవ్రంగా స్పందించింది. సిరి దినపత్రికల ప్రచురితమైన రామ 'కృష్ణ'లీలలు కథనం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. దీనిపై తక్షణమే స్పందించిన పటాన్‌చెరు డివిజనల్ ఇంజనీర్.. సదరు అధికారిని సంగారెడ్డి సర్కిల్ కార్యాలయానికి సరెండర్ చేస్తూ ఉన్నతాధికారులకు లేఖ రాశారు. అంతేకాకుండా, సిరి కథనం ఆధారంగా రూరల్ సెక్షన్‌లో గత మూడేళ్లుగా రామకృష్ణ వేసిన సాంకేతిక అంచనాలపై ప్రత్యేక దర్యాప్తు చేపట్టాలని కార్పొరేట్ అధికారుల నుంచి స్పష్టమైన ఆదేశాలు వెలువడ్డాయి. ఈ కథనం ఎఫెక్ట్‌తో అధికారులు పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ఇతర సెక్షన్లపైనా

మిగతా 2వ పేజీలో..

## పెన్షనర్ల 'వాట్సాప్ స్టేటస్'గా

సిరి ఎఫెక్ట్

# సిరి కథనం..!



మా బాధకు అక్షర రూపం అంటున్న విద్యుత్ శాఖ పెన్షనర్లు
'పెద్ద సారుకు కోపమొచ్చింది..' కథనానికి విశేష స్పందన
వేలాది మంది వృద్ధుల సెల్‌ఫోన్లలో నిరసన హోరు
వార్తపై ఆరా తీసిన ముఖ్యమంత్రి కార్యాలయం
సీఎంఓ ఆదేశాలతో సోమవారం ఖాతాల్లోకి పెన్షన్ డబ్బులు

**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:** 'విద్యుత్ శాఖలో పెద్ద సారుకు కోపమొచ్చింది.. పెన్షన్ ఆగిపోయింది' అనే శీర్షికతో 'సిరి' దినపత్రికలో ప్రచురితమైన కథనం వేలాది మంది విద్యుత్ శాఖ పెన్షనర్ల మనసుకు హత్తుకుంది. ఎన్నడూ లేని విధంగా సిబ్బంది అందరికీ జీతాలు ఇచ్చి, వృద్ధాప్యంలో ఉన్న తమకు పెన్షన్ ఆపడంపై వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తమ బాధను అక్షర రూపంలో పెట్టిన సిరి కథనాన్ని శనివారం వేలాది మంది పెన్షనర్లు తమ వాట్సాప్ స్టేటస్‌లుగా పెట్టుకుని వినూత్న రీతిలో నిరసన తెలియజేశారు.

### స్పందించిన సీఎంఓ.. సోమవారం పెన్షన్లు!

సిరిలో వచ్చిన ఈ కథనంపై ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంఓ) తక్షణమే స్పందించింది. పెన్షన్ల విడుదలలో జాప్యంపై అధికారులను వాకబు చేసింది. నిధుల కొరత వల్ల ఆగిందా? లేక ఉద్దేశపూర్వకంగానే నిలిపివేశారా? అనే విషయాలపై ఆరా తీసినట్లు సమాచారం. పెన్షనర్ల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సీఎంఓ స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడంతో, సోమవారం నాటికి పెన్షనర్ల ఖాతాల్లో వారి పెన్షన్ డబ్బులు జమ కానున్నట్లు తెలుస్తోంది.



## ప్రభుత్వ భూములను పెద్దలకు దోచిపెడుతున్న రేవంత్

భూదందాలో సీఎం కుటుంబీకులు, కాంగ్రెస్ ప్రముఖులు
కల్వకుంట్ల కవిత ఆరోపణలు

2



## సెమీ కండక్టర్ పరిశ్రమలకు అనుకూలం

ఇక్కడ పెట్టుబడులు పెట్టేలా కంపెనీలను ప్రోత్సహించండి
మలేషియా బృందం భేటీలో మంత్రి శ్రీధర్‌బాబు

2



## పచ్చదనంతో పర్యావరణాన్ని కాపాడండి

3

# ప్రభుత్వ నిర్లక్ష్యానికి రైతు కనకయ్య బలి

తడిసిన వడ్లు కొనాలని ప్రాధేయపడితే 40 సంచులు కట్ చేశారు
కనకయ్య కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలి
కోతలు లేకుండా వడ్లను తక్షణమే కొనుగోలు చేయాలని డిమాండ్
ఆయన కుటుంబానికి ఆర్థిక సాయం చేసిన హరీష్ రావు



**సిద్దిపేట, జూన్ 6 సిరి న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం, వడ్ల కొనుగోలులో అవకతవకల వల్లే ఇవాళ నారాయణరావుపేట గ్రామానికి చెందిన కనకయ్య అనే రైతు బలి అయ్యాడని సిద్దిపేట ఎమ్మెల్యే, అసెంబ్లీలో బీఆర్ఎస్ ఉప నాయకుడు హరీష్‌రావు ఆరోపించారు. సిద్దిపేట నియోజకవర్గం నారాయణరావుపేట మండల కేంద్రానికి చెందిన రైతు పల్లెవేని కనకయ్య (గద్దర్) గుండెపోటుతో శనివారం మృతిచెందాడు. ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి కనకయ్య మృతి తీవ్రంగా కలచివేసిందన్నారు. ఆ కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చి హరీష్ రావు ఆర్థిక సహాయం

మిగతా 2వ పేజీలో..




## కుటుంబ బంధాల బలోపేతానికి

# మీ సురక్ష

సీడీఈడబ్ల్యు, ఎఫ్‌సీసీల ఆధ్వర్యంలో నిర్వహణ
కుటుంబ వివాదాల పరిష్కారం లక్ష్యం
కౌన్సెలింగ్ సెంటర్ల జోక్యంతో ఒక్కటైన 150 జంటలు
ముఖ్య అతిథిగా పాల్గొన్న డీజీపీ ఆనంద్

**హైదరాబాద్, జూన్ 6 సిరి న్యూస్:** మహిళల భద్రత, కుటుంబ సంక్షేమం, వైవాహిక బంధాల పరిరక్షణ లక్ష్యంగా మల్కాజిగిరి కమిషనరేట్ మహిళా భద్రత విభాగం ఆధ్వర్యంలో సెంటర్ ఫర్ డెవలప్మెంట్ అండ్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్ (సీడీఈడబ్ల్యు) - ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్స్ (ఎఫ్‌సీసీ)

మిగతా 2వ పేజీలో..

## సంగారెడ్డి జిల్లాలో

# టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ పర్యటన!

క్షేత్ర స్థాయిలో అధికారులతో జితేష్ వి పాటిల్ సమీక్ష
సంగారెడ్డి మెటీరియల్ స్టోర్ పరిశీలన
సదాశివపేటలో ఎస్పీఎం తనిఖీ
కలబగుర్ లో 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిశీలన

**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:** టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ శనివారం సంగారెడ్డి జిల్లాలోని పలు విద్యుత్ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేసారు. సీఎండీ గా బాధ్యతలు చేపట్టిననాటినుండి క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితులపై అయన పర్యవేక్షణ జరుపుతున్నారు. ఈ మేరకు సంగారెడ్డి స్టోర్స్ సందర్శించిన ఆయన అక్కడ వాస్తవ పరిస్థితిపై జిల్లా ఎస్ఈ ని అడిగి తెలుసుకున్నారు. స్టోర్ లో ఉన్న మెటీరియల్ రిజిస్టర్ ను పరిశీలించారు. స్టాక్ పొజిషన్ పై

మిగతా 2వ పేజీలో..





## అప్పు తిరిగిమన్నందుకు

# ఇంటికి నిప్పు!

సజీవ దహనం కాకుండా తప్పించుకున్న కుటుంబం
నిజామాబాద్ జిల్లాలో దారుణం
నిందితుడిపై హత్యాయత్నం కేసు
సీపీ సీరియస్.. పోలీసుల అదుపులో నిందితుడు

**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:** ఇచ్చిన అప్పునకు సంబందించిన వడ్డీ వివాదం కారణంగా ఓ వ్యక్తి ఇల్లు దహనమైన ఘటన చోటుచేసుకుంది. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలం పిప్రి గ్రామానికి చెందిన రాజముల్లు.. అబ్దుల్ ఖాద్రి అనే వ్యక్తికి రూ.5 లక్షలు అప్పుగా ఇచ్చాడు. అబ్దుల్ ఖాద్రి ఆ అప్పు అసలును, వడ్డీ కింద మరో చెక్కును చెల్లించాడు. ఆ వడ్డీకి సంబందించిన చెక్ డ్రా చేసుకున్నాడనే కోపంతో అబ్దుల్.. 35 లీటర్ల పెట్రోల్ రాజముల్లు ఇంటిపై పోసి

మిగతా 2వ పేజీలో..

## బియ్యం ఎగుమతులకు కేంద్రంగా మారాలి

ఎగుమతి ఆధారిత మిల్లులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు
రైస్ మిల్లింగ్ రంగంలో యాంత్రీకరణకు ప్రాధాన్యం
ఆధునిక గోదాములు, స్టీల్ సైలోల నిర్మాణానికి పెట్టుబడులు ఆహ్వానం: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

2



## విశ్వవేదికపై సింగరేణి జెండా

- జట్టును అభినందించిన భట్టి



2

# పటాన్‌చెరు ఏఈ రామకృష్ణ అవినీతిపై కొరడా..!

**మొదటిపేజీ తరువాయి**

ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

**సీఎండీ దృష్టికి రామకృష్ణ వ్యవహారం**

శనివారం ఆకస్మికంగా సంగారెడ్డి జిల్లాలో పర్యటించిన టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్ దృష్టికి ఓ ఉన్నతాధికారి ఈ ఏఈ అవినీతి వ్యవహారాన్ని తీసుకెళ్లారు. దీనిపై ఆయన తీవ్రంగా స్పందించినట్లు సమాచారం. సదరు అధికారిపై సీఎండీ ఎలాంటి కఠిన నిర్ణయం తీసుకుంటారో మరో రెండ్రోజుల్లో స్పష్టం కానుంది.

**'సిరి'కి బాధితుల కృతజ్ఞతలు**

ఒక్క అవినీతి అధికారి వల్ల ఇబ్బంది పడిన వందలాది మంది బాధితులు ఇప్పుడు సిరి కథనంతో ఊపిరిపీల్చుకున్నారు. పటాన్‌చెరు ఏఈ రామకృష్ణకు సంబంధించిన అవినీతి పరంపరను సాహసోపేతంగా వెలుగులోకి తెచ్చినందుకు వారంతా 'సిరి' పత్రికకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.





రామకృష్ణ లీలలు..!

# కుటుంబ బంధాల బలోపేతానికి మీ సురక్ష

**మొదటిపేజీ తరువాయి**

ఆధ్వర్యంలో 'మీ సురక్ష - కలసి ఉంటే కలదు సుఖం' పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. కుటుంబ సామరస్యాన్ని పెంపొందించడం, వైవాహిక బంధాలను బలోపేతం చేయడం, మహిళల భద్రతపై అవగాహన కల్పించడం, కుటుంబ వివాదాలను కౌన్సెలింగ్ మధ్యవర్తిత్వం ద్వారా శాంతియుతంగా పరిష్కరించేందుకు ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యంగా నిర్వహించారు. మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలోని సీడీఈడబ్ల్యు ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్ల జోక్యంతో తిరిగి కలిసిన 150కి పైగా దంపతులు, వారి కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా డీజీపీ సి.వి.ఆనంద్ మాట్లాడుతూ ప్రభుత్వం, పోలీస్ శాఖ అమలు చేస్తున్న మహిళా భద్రత కార్యక్రమాలను వివరించారు. మహిళలు, పిల్లల భద్రత, గౌరవం, సాధికారత ప్రభుత్వ అత్యున్నత ప్రాధాన్యతలలో ఒకటని పేర్కొన్నారు. షీ టీమ్స్, భరోసా కేంద్రాలు, మహిళా పోలీస్ స్టేషన్లు, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్లు, షీ షటిల్స్, సీడీఈడబ్ల్యు ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్లు వంటి కార్యక్రమాలు మహిళల భద్రతను మరింత బలోపేతం చేశాయని తెలిపారు. మీ సురక్ష-కలసి ఉంటే కలదు సుఖం కార్యక్రమాన్ని ప్రశంసిస్తూ, కౌన్సెలింగ్, మధ్యవర్తిత్వం ద్వారా కుటుంబాలను తిరిగి కలపడంలో మహిళా భద్రత విభాగం, మల్కాజిగిరి కమిషనరేట్ చేస్తున్న కృషిని అభినందించారు. సమాజంలో భార్యాభర్తల మధ్య పరస్పర గౌరవం కుటుంబ జీవితానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. మహిళా భద్రతా విభాగం డీజీపీ చారు సిన్హా మాట్లాడుతూ కుటుంబ సంబంధాల బలోపేతానికి భార్య భర్తలు ఇద్దరూ ఓపికతో, విశ్వాసంతో పాటు ఇద్దరి మధ్య అవగాహన అవసరమని చెప్పారు. భరోసా కేంద్రాలు, సీడీఈడబ్ల్యు ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్లు కుటుంబ వివాదాల పరిష్కారంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని వివరించారు. స్టేట్ జ్యుడీషియల్ అకాడమీ హెడ్ ఎస్.ఎన్.శ్రీదేవి మాట్లాడుతూ వివాహం పరస్పర గౌరవం, అవగాహన, ఆధారపడిన సామాజిక వ్యవస్థ అని చెప్పారు. కుటుంబ వివాదాల పరిష్కారంలో కౌన్సెలింగ్, కీలకమన్నారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి.సుమతి మాట్లాడుతూ, సీడీఈడబ్ల్యు ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్లు కుటుంబ వివాదాల పరిష్కారం, మహిళా సాధికారత, కుటుంబ సంక్షేమానికి సమర్థ వేదికగా మారాయని తెలిపారు. కమిషనరేట్ పరిధిలో ఎనిమిది ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్లు పనిచేస్తున్నాయని, ఇప్పటివరకు 9,700కు పైగా కేసులను పరిష్కరించడంతోపాటు 32,000కు పైగా కౌన్సెలింగ్ సెషన్లు నిర్వహించినట్లు తెలిపారు. అలాగే సీడీఈడబ్ల్యులు, మహిళా పోలీస్ స్టేషన్లు కలిసి 377 అవగాహన కార్యక్రమాలు నిర్వహించి 16 వేల మందికి పైగా ప్రజలకు చేరువయ్యాయని, సీడీఈడబ్ల్యు సేవలపై 90 శాతానికి పైగా సంతృప్తి వ్యక్తమైందని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా తిరిగి కలిసిన దంపతులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. కుటుంబ కౌన్సెలింగ్, వివాదాల పరిష్కారం, పునరావాసం, కుటుంబ సంక్షేమంలో విశేష సేవలందించిన ఉత్తమ సీడీఈడబ్ల్యుకేంద్రాలు, కౌన్సిలర్లు, సిబ్బందిని సత్కరించారు. తిరిగి కలిసిన దంపతులు తమ అనుభవాలను పంచుకుంటూ, తమ కుటుంబాలను నిలబెట్టడంలో సహకరించిన కౌన్సెలర్లు, పోలీసు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మై ఛాయిస్ ఫౌండేషన్ ప్రతినిధి పెర్ల్ చోరగుడి, మహిళా భద్రత డీసీపీ టి.ఉషారాణి, సీనియర్ పోలీస్ అధికారులు, మహిళా పోలీస్ స్టేషన్ సిబ్బంది, షీ టీమ్స్, భరోసా కేంద్రాల ప్రతినిధులు, సీడీఈడబ్ల్యు కౌన్సెలర్లు, భాగస్వామ్య సంస్థల ప్రతినిధులు, తిరిగి కలిసిన దంపతులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## అప్పు తిరిగిమన్నందుకు ఇంటికి నిప్పు!

**మొదటిపేజీ తరువాయి**

నిప్పంటించాడు. ఈ ప్రమాదంలో రాజమల్లు ఇల్లు, గృహోపకరణాలు కాలిపోయాయి. సుమారు కోటి రుపాయలకు పైగా ఆస్తినష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా వేశారు.

**నిజామాబాదు సీపీ సీరియస్**

ఈ ఘటనపై నిజామాబాద్ సీపీ సాయిచైతన్య సీరియస్‌గా స్పందించారు. అబ్దుల్ పై హత్య యత్నం కేసు నమోదు చేశారు. ఆర్మూర్ సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు. ఇలాంటి దుందుడుకు చర్యలకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామని సీపీ తెలిపారు.

**బతిమాలుతున్నా వదల్లే..**

అప్పిచ్చిన పాపానికి ఆ కుటుంబం ఇప్పుడు వీధి పాలయ్యింది. పిప్రి సంఘటనలో అబ్దుల్ ఖాద్రి ఇంటిపై పెట్రోల్ పోయడమే కాకా కుటుంబ సభ్యులను హతమారుస్తే ఇక అప్పుల బాధలు ఉండవన్న పక్కా ప్రణాళికతో వచ్చాడట. రాజమల్లు ఇంటికి వచ్చిన అబ్దుల్ ఇంటిపై పెట్రోల్ పోస్తుండగా కుటింబికులు బతిమాలాడారట, ఏదైనా ఉంటె మాట్లాడుకుందాం ఇంటి జోలికి రావద్దని చెప్పిన వినకుండా ఇంటికి నిప్పు పెట్టాడట ఆ సమయంలో కుటుంబీకులు చాకచక్యంగా తప్పించుకున్నారు. లేదంట ఒక కుటుంబం అప్పిచ్చిన పాపానికి సజీవ దహనం అయ్యేది.

## సంగారెడ్డి జిల్లాలో టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ పర్యటన!

**మొదటిపేజీ తరువాయి**

ఆరాతీసారు. ఈ మేరకు వినియోగదారులకు ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా స్టాక్ ఉంచాలని ఆదేశించారు.ఇదే సందర్భంలో స్క్రాప్ ఎంతుంది? ట్రాన్సఫార్మర్లు ,మీటర్ల పరిస్థితి ఏంటి ? అనే విషయాలపై అరా తీసినట్టు సమాచారం. ఆపై ఇటీవల తాగునీటి సరఫరా మంజీరా ఫీడర్ లో తరుచు వస్తున్న అంతరాయాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా నిరంతరంగా విద్యుత్ సరఫరా చేయాలని అయన అధికారులను ఆదేశించారు. సదాశివపేటలోని ట్రాన్సఫార్మర్ రిపేరింగ్ సెంటర్ సందర్శించారు.

# ప్రభుత్వ భూములను పెద్దలకు దోచిపెడుతున్న రేవంత్

**హైదరాబాద్, జూన్ 6:**

రూ.లక్ష కోట్ల ప్రభుత్వ భూమిని రేవంత్ రెడ్డి సర్కార్ పెద్దలకు ధారాదత్తం చేస్తున్నదని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. సీఎం కుటుంబ సభ్యులు, ప్రభుత్వ పెద్దలు, కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు భూదందాలో చురుకుగా ఉన్నారని ఆరోపించారు. అయితే ఈ ప్రభుత్వ భూములను సుప్రీంకోర్టు వరకు వెళ్లి తాము కాపాడుతామని స్పష్టం చేశారు. హైడ్రా..పేదల కాలనీల్లో దాడులు చేసి ఆ భూములను పెద్దలకు అప్పగిస్తోందని మండిపడ్డారు. శ్రీఆదిత్య కంపెనీ రివర్ బెడ్‌పైన ప్రాజెక్టు కడుతోందని.. ఆ కంపెనీ వెనుక ఓ ఎంపీ ఉన్నారన్నారు. శ్రీ ఆదిత్య కంపెనీకి బీఆర్ఎస్ హయాంలోనే పర్మిషన్ ఇచ్చారని.. దాన్ని ముట్టుకునే దమ్ము ప్రభుత్వానికి ఉందా అని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డికి నీళ్లపై అవగాహన లేదని కవిత విమర్శించారు. మహారాష్ట్ర సీఎం అపాయింట్‌మెంట్ ఇవ్వకపోతే ఏపీ సీఎం ఇవ్వరా? అని ప్రశ్నించారు. ఏపీ సీఎంతో మాట్లాడి 200 టీఎంసీల నీళ్లు తెచ్చి ఆ తర్వాత బనకచర్ల గురించి మాట్లాడాలన్నారు. అప్పుడు కేటీఆర్ పాలన నడిచిందని.. ఇప్పుడు కూడా కేటీఆర్ పాలనే నడుస్తోందన్నారు. అప్పుడు కేటీఆర్ అంటే కేసీఆర్, తన్నీరు హరీష్ రావు, రామారావు.. ఇప్పుడు కేటీఆర్ అంటే కొండల్ రెడ్డి, తిరుపతి రెడ్డి, రేవంత్ రెడ్డి అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్, బీజేపీ పరస్పర సవాళ్లతో ఒరిగేదేమీ లేదని కవిత విమర్శించారు. తెలంగాణ బరాబర్ ప్రజల జాగీరే అని, పవన్ కల్యాణ్ జాగీర్ కాదని కవిత స్పష్టం చేశారు. ఆంధ్రా విషకోరల నుంచి తెలంగాణను కాపాడుకున్నామన్నారు. ఇక్కడకు వచ్చి రాజకీయం చేస్తామంటే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. పవన్‌కు మద్దతు ఇస్తే నాలుగు ఓట్లు వస్తాయని బీజేపీ భావిస్తోందని, వచ్చే ఎన్నికల్లో బీజేపీకి ఉన్న 8 సీట్లు పోతాయన్నారు. పవన్ కల్యాణ్ 10 ఎకరాలు శిఖం భూమిని కొనుగోలు చేశారని, కోడికుంట సర్వే నం. 706లో శిఖం భూమి ఉందన్నారు. రిజిస్ట్రేషన్ సమయంలో అనేక తప్పులు జరిగాయని, ఆ భూమిని పవన్ తిరిగి ఇచ్చేయాలన్నారు. శిఖం భూమిలో వేసిన కంచెను పవన్ తొలగించాలని కవిత డిమాండ్ చేశారు.

# సెమీ కండక్టర్ పరిశ్రమలకు అనుకూలం

**హైదరాబాద్, జూన్ 6 సిరి న్యూస్:**

సెమీకండక్టర్ పరిశ్రమల ఏర్పాటుకు దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణ అత్యంత అనుకూలమని, ఇక్కడ పెట్టుబడులు పెట్టేలా మలేషియా కంపెనీలను ప్రోత్సహించాలని ఆ దేశ ప్రతినిధుల బృందాన్ని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కోరారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా, రాబోయే రోజుల్లో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనేలా ప్రపంచ స్థాయి సదుపాయాలతో కూడిన సెమీ కండక్టర్ 'ఎకోసిస్టం'ను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామన్నారు. మలేషియాపెనాంగ్ డిప్యూటీ సీఎం వైబీ జగదీప్ సింగ్ దియో నేతృత్వంలోని ఆ దేశ అత్యున్నతస్థాయి ప్రతినిధుల బృందం సచివాలయంలో మంత్రి శ్రీధర్‌బాబును శనివారం మర్యాదపూర్వకంగా కలిసింది. తెలంగాణ మలేషియా(పెనాంగ్) మధ్య సెమీ కండక్టర్లు, ఎలక్ట్రానిక్స్ తయారీ, ఏఐ, ఇన్నోవేషన్స్, హ్యూమన్ క్యాపిటల్ డెవలప్ మెంట్ తదితర రంగాల్లో పరస్పర సహకారానికి గల అవకాశాలపై ప్రత్యేకంగా చర్చించారు. చిప్ డిజైన్, ఎలక్ట్రానిక్స్, అధునాతన సాంకేతిక రంగాల్లో హైదరాబాద్ అంతర్జాతీయ కేంద్రంగా ఎదుగుతోందని మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. సెమీ కండక్టర్స్, ఎలక్ట్రానిక్స్ తయారీ, అడ్వాన్స్డ్ మాన్యుఫ్యాక్చరింగ్, ఎమర్జింగ్ టెక్నాలజీస్, లైఫ్ సైన్సెస్, బయో టెక్నాలజీ, క్లీన్ ఎనర్జీ, ఏరో స్పేస్, డిఫెన్స్, ప్రెసిషన్ ఇంజినీరింగ్ తదితర రంగాల్లో తెలంగాణలో అపార అవకాశాలు ఉన్నాయన్నారు. గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ డెస్టినేషన్‌గా తెలంగాణను తీర్చిదిద్దేందుకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. తెలంగాణను దేశంలోని ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా తీర్చిదిద్దేందుకు అంతర్జాతీయ భాగస్వామ్యాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందన్నారు. సెమీకండక్టర్ అసెంబ్లీ, టెస్టింగ్, ప్యాకేజింగ్ రంగాల్లో పెనాంగ్‌కు ఉన్న అనుభవం.. గ్లోబల్ సెమీ కండక్టర్ హబ్‌గా తెలంగాణ ఎదిగేందుకు ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ వంటి ప్రగతిశీల రాష్ట్రంతో కలిసి పనిచేసేందుకు ఆసక్తిగా ఉన్నాం.. ఇరు ప్రాంతాల మధ్య పరస్పర సహకారాన్ని బలోపేతం చేసేలా సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకుని ముందుకెళ్తాం అని వైబీ జగదీప్ సింగ్ దియో పేర్కొన్నారు.

# ప్రభుత్వ నిర్లక్ష్యానికి రైతు కనకయ్య బలి

**మొదటిపేజీ తరువాయి**

అందించారు. కనకయ్య పండించిన వడ్లను మార్కెట్ యార్డులో దాదాపు 45 రోజులపాటు ఎవరూ కొనకుండా ఆలస్యం చేయగా వర్షానికి వడ్లన్నీ తడిసిపోయాయి. తడిసిన వడ్లను మిల్లుకు తీసుకెళ్లి ప్రాధేయపడితే నాలుగు ట్రాక్టర్ల వడ్లకు గాను 40 సంచుల వడ్లను మిల్లర్లు కట్ చేశారు. 40 సంచుల వడ్లు కట్ చేసింద్రు అని నిన్న రాత్రి వరకు తోటి రైతులతో, కుటుంబ సభ్యులతో బాధపడుతూ నిద్రలోనే ఆయనకు గుండెపోటు వచ్చి మరణించాడని తెలిపారు. ఇది కచ్చితంగా ప్రభుత్వ హత్యే అని హరీష్‌రావు ఆరోపించారు. హైదరాబాద్‌లో కూర్చుని 80% - 90% వడ్లు కొన్నామని ప్రభుత్వం చెప్తోంది.. కానీ క్షేత్రస్థాయిలో ప్రతి ఊర్లో ఇంకా 30% నుండి 40% వడ్లు పెండింగ్‌లోనే ఉన్నాయన్నారు. వర్షాలు పడుతున్నాయి.. కొన్ని గ్రామాల్లో రెండు నెలలుగా వడ్లు అమ్ముకోలేక మిల్లులు, గోదాముల ముందు లారీలతో రోజులతరబడి పడిగాపులు కాస్తున్నారు.. క్వింటాల్‌కు 4 నుండి 5 కిలోల కోత పెడుతూ రైతుల ఉసురు పోసుకుంటున్నారని తెలిపారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో పంట పండించడం సులభంగా ఉంది కానీ ఆ పంటను అమ్ముకోవాలంటే రైతులకు నరకం కనిపిస్తోంది అని హరీష్‌రావు విమర్శించారు. కుకునూరుపల్లి దగ్గర ఒక రాజస్థాన్ లారీలో వడ్లు ఎక్కించే ప్రయత్నం చేస్తే ఆ లారీ వడ్లతో సహా రాజస్థాన్ వెళ్ళిపోయిందన్నారు. దుబ్బాక మండలం చేర్వాపూర్‌లో సంచులు ఎత్తకపోవడం వల్ల, అలాగే ఎన్సాన్‌పల్లిలో కూడా కొనుగోలు చేయకపోవడం వల్ల వడ్లు మొత్తం చెదలు పట్టిపోతున్నాయని చెప్పారు. మంత్రి దామోదర్ రాజనర్సింహ నియోజకవర్గమైన అల్లాదుర్గం మండలం వెంకటాపూర్ గ్రామంలో ఇప్పటివరకు ఒక్క క్వింటాల్ వడ్లు కూడా కొనలేదన్నారు. ఎక్కడి వడ్లు అక్కడే ఉన్నాయని, రేవంత్ రెడ్డి గారు క్షేత్రస్థాయి సమస్యలు వదిలేశారన్నారు. ఎరువుల సరఫరాలో ప్రభుత్వం విఫలమైంది.. రైతుబంధు ఇవ్వకుండా మోసం చేసింది.. నాలుగు నెలలుగా రాష్ట్రంలో చనిపోయిన రైతులకు రైతుబీమా అందడం లేదు.. దానిని రద్దు చేశారు.. అధికారులు, మంత్రులు ఎవరూ పట్టించుకోవడం లేదు అని విమర్శించారు. ప్రభుత్వం కలెక్టర్ వెంటనే స్పందించి కనకయ్య కుటుంబాన్ని ఆదుకోవాలని, వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో మాటలు కట్టిపెట్టి ఎలాంటి కోతలు లేకుండా యుద్ధప్రాతిపదికన వడ్లను తక్షణమే కొనుగోలు చేయాలని హరీష్‌రావు డిమాండ్ చేశారు.



# విశ్వవేదికపై సింగరేణి జెండా

- మైన్స్ రెస్క్యూ పోటీల్లో ప్రథమ బహుమతి
- అంతర్జాతీయ స్థాయిలో సరికొత్త రికార్డు
- జట్టును అభినందించిన డిప్యూటీ సీఎం భట్టి

**హైదరాబాద్, జూన్ 6 సిరి న్యూస్:**



అంతర్జాతీయ వేదికపై తెలంగాణ ఖ్యాతిని చాటిన సింగ□kశిణి రెస్క్యూ జట్టును ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శనివారం అభినందించారు. హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో భట్టి విక్రమార్కను సింగరేణి సీఎండీ జ్యోతి బుద్ధ ప్రకాష్‌తో కలిసి రెస్క్యూ జట్టు మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా వారు సాధించిన ప్రతిష్ఠాత్మక ట్రోఫీలను, మెడల్‌స్‌ను డిప్యూటీ సీఎంకు అందించారు. భూగర్భ గనుల రక్షణలో తామెప్పుడూ అగ్రగామినే అని సింగరేణి సంస్థ ప్రపంచ వేదికపై మరోసారి నిరూపించిందని భట్టి అన్నారు. జాంబియా దేశంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన అంతర్జాతీయ మైన్స్ రెస్క్యూ పోటీలలో సింగరేణి రెస్క్యూ జట్టు అద్భుత ప్రదర్శనతో విశ్వవిజేతగా నిలవడం సంతోషకరమని అన్నారు. చైనా, కెనడా, ఆస్ట్రేలియా, పోలాండ్, కొలంబియా వంటి గనులు అధికంగా ఉండే దిగ్గజ దేశాల జట్లతో పోటీపడి ప్రథమ బహుమతి కైవసం చేసుకోవడం గర్వకారణమని అన్నారు. గనుల్లో ప్రమాదాలు జరిగినప్పుడు, విపత్కర పరిస్థితులు ఎదురైనప్పుడు రెస్క్యూ సిబ్బంది తమ ప్రాణాలను పణంగా పెట్టి అందించే సేవలు అసమానమైనవని కొనియాడారు. సింగరేణిని కేవలం ఒక బొగ్గు ఉత్పత్తి సంస్థగానే కాకుండా, అన్ని రంగాల్లోనూ అగ్రగామిగా నిలిపేందుకు మా ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని డిప్యూటీ సీఎం అన్నారు. గనుల్లో అత్యంత కఠినమైన పరిస్థితుల్లో పనిచేసే మన రెస్క్యూ సిబ్బంది నైపుణ్యం, అంతర్జాతీయ పోటీల ద్వారా ప్రపంచానికి తెలిసిందన్నారు. కార్యక్రమంలో సింగరేణి డైరెక్టర్ (పి అండ్ పి) కె. వెంకటేశ్వర్లు, జీఎం (కోఆర్డినేషన్, మార్కెటింగ్) టి.శ్రీనివాస్, రెస్క్యూ జీఎం శ్రీనివాసరెడ్డి, రెస్క్యూ జట్టు సభ్యులు, సింగరేణి ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# బియ్యం ఎగుమతులకు కేంద్రంగా మారాలి

**మొదటిపేజీ తరువాయి**

శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో శనివారం నిర్వహించిన ఇంటర్నేషనల్ రైస్ అండ్ గ్రెయిన్స్ టెక్ ఎక్స్‌పో2026లో మంత్రి ముఖ్య అతిథిగా ప్రసంగించారు. రాష్ట్ర అభివృద్ధిలో రైస్ మిల్లర్లు కీలక భాగస్వాములని పేర్కొన్న మంత్రి, రైతులు, మిల్లర్లు, వినియోగదారులు అందరూ కలిసి అభివృద్ధి ఫలాలను పొందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. బియ్యం ఎగుమతులను పెంచేందుకు తెలంగాణలో కొత్తగా ఏర్పాటయ్యే ఎగుమతి ఆధారిత రైస్ మిల్లులకు, అలాగే ప్రస్తుతం పనిచేస్తున్న మిల్లులు ఎగుమతుల వైపు మళ్లేందుకు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందని తెలిపారు. ప్రపంచ బియ్యం మార్కెట్లలో తెలంగాణకు ప్రత్యేక స్థానం కల్పించడమే ఈ చర్యల ప్రధాన ఉద్దేశమన్నారు.

**యాంత్రీకరణ ద్వారానే అభివృద్ధి**

రైస్ మిల్లింగ్ రంగంలో కార్మికుల కొరత ప్రధాన సవాలుగా మారిందని పేర్కొన్న మంత్రి యాంత్రీకరణ, ఆటోమేషన్‌కు మిల్లర్లు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఆధునిక యంత్రాల వినియోగం ద్వారా ఉత్పాదకత పెరగడంతోపాటు కార్మికుల కొరత సమస్యను అధిగమించవచ్చన్నారు. స్టీల్ సైలోలు, ఆటోమేటెడ్ గోదాములు, కృత్రిమ మేధస్సు ఆధారిత ధాన్యస్త్ర పర్యవేక్షణ వ్యవస్థలు, డిజిటల్ ఇన్వెంటరీ నిర్వహణ వంటి ఆధునిక నిల్వ సదుపాయాల నిర్మాణం అత్యవసరమని ఆయన పేర్కొన్నారు. ప్రజాప్రైవేటు భాగస్వామ్య విధానంలో భారీ సామర్థ్యంతో గోదాముల నిర్మాణానికి పెట్టుబడిదారులు ముందుకు రావాలని ఆహ్వానించారు.

**పర్యావరణహిత పార్బాయిలింగ్ సాంకేతికతలు అవసరం**

పార్బాయిలింగ్ యూనిట్లలో నీటి వినియోగాన్ని తగ్గించే, విద్యుత్ ఆదా చేసే ఆధునిక సాంకేతికతలను పరిశ్రమలు అవలంబించాలని మంత్రి సూచించారు. భవిష్యత్ ప్రాసెసింగ్ యూనిట్లు నీటి పునర్వినియోగం, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.

**పోషక విలువలతో కూడిన బియ్యం ఉత్పత్తి**

నాణ్యతతోపాటు పోషక విలువలను కూడా దృష్టిలో ఉంచుకుని బియ్యం ప్రాసెసింగ్ జరగాలని మంత్రి ఉత్తమ్ అన్నారు. నియంత్రిత వైటనింగ్, ప్రిసిషన్ పాలిషింగ్, పోషకాలనుకాపాడే సాంకేతికతలు, ఏఐ ఆధారిత నాణ్యత నిర్ధారణ విధానాలు వినియోగదారులకు మరింత ఆరోగ్యకరమైన బియ్యం అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు.

**దేశానికి దిక్సూచి తెలంగాణ**

ప్రస్తుతం రాష్ట్రంలో ఏటా సుమారు 300 లక్షల మెట్రిక్ టన్నుల వరి ఉత్పత్తి జరుగుతోందని మంత్రి తెలిపారు. దేశంలో యాసంగి వరి కొనుగోళ్లలో తెలంగాణ వాటా దాదాపు 60 శాతం ఉందన్నారు. ప్రస్తుత ఖరీఫ్, యాసంగి సీజన్లలో రైతుల ఖాతాల్లో ప్రభుత్వం దాదాపు రూ.39 వేల కోట్లు జమ చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి రైతులకు రూ.96 వేల కోట్లకు పైగా చెల్లింపులు చేసినట్లు తెలిపారు. అలాగే సన్న బియ్యం పంపిణీ పథకం ద్వారా 3.2 కోట్ల మందికి లబ్ధి చేకూరుతోందని, ఇందుకోసం ఏటా సుమారు రూ.14 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని చెప్పారు. రైతులు, మిల్లర్లు, సాంకేతిక నిపుణులు, విధాన రూపకర్తలు సమష్టిగా కృషి చేస్తే బియ్యం ఉత్పత్తిలోనే కాక బియ్యం సాంకేతికత, ఆవిష్కరణలు, ఎగుమతుల రంగంలో కూడా తెలంగాణ ప్రపంచస్థాయి కేంద్రంగా ఎదుగుతుందని మంత్రి ఉత్తమ్ కుమార్ అన్నారు.

**చేనేతల సంక్షేమం, అభివృద్ధికి సంపూర్ణ అండ : ఉత్తమ్**

**'థ్రెడ్ పోచంపల్లి' సందర్శన**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, కళాత్మక నైపుణ్యానికి ప్రతీకగా నిలిచిన పోచంపల్లి ఇక్కత్ ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందడం ప్రతి తెలంగాణవాసికి గర్వకారణమని మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో నిర్వహిస్తున్న 'థ్రెడ్ పోచంపల్లి' ప్రత్యేక ప్రదర్శనలో పాల్గొన్న సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ పోచంపల్లి ఇక్కత్ ఒక వస్త్ర కళ మాత్రమే కాదని, అది తెలంగాణ చరిత్ర, సంస్కృతి, సృజనాత్మకత, సంప్రదాయ జీవన విధానానికి అద్దం పట్టే అద్భుత కళారూపమని అభివర్ణించారు. రంగుల సమన్వయం, నూలు పోగుల్లో కనిపించే అపూర్వమైన డిజైన్లు, తరతరాలుగా వస్తున్న కళాత్మక నైపుణ్యం వల్ల పోచంపల్లి ఇక్కత్ ప్రపంచ ఫ్యాషన్ రంగంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుందని చెప్పారు. చేనేత కార్మికుల కష్టం, పట్టుదల, నైపుణ్యం వల్లే పోచంపల్లి పేరు ప్రపంచ పటంలో నిలిచిందని మంత్రి కొనియాడారు. ఒక చీర తయారీ వెనుక కుటుంబమంతా కలిసి చేసే శ్రమ, సృజనాత్మకత, అంకితభావం దాగి ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం చేనేత రంగాన్ని బలోపేతం చేయడానికి ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. చేనేత కార్మికుల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా సంక్షేమ కార్యక్రమాలు, మార్కెటింగ్ అవకాశాలు, ఆర్థిక సహాయం, శిక్షణ కార్యక్రమాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. చేనేత ఉత్పత్తులకు దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో మరింత గుర్తింపు తీసుకురావడానికి కృషి చేస్తున్నామన్నారు. చేనేత ఉత్పత్తుల అమ్మకాల పెరుగుదల ద్వారా వేలాది కుటుంబాలకు ఉపాధి భద్రత కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు. పోచంపల్లి పేరు నేడు దేశ సరిహద్దులు దాటి అంతర్జాతీయ స్థాయిలో వినిపించడానికి కారణం చేనేత కార్మికుల ప్రతిభేనని కొనియాడారు. ఈ కళను భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. యువత కూడా చేనేత రంగం వైపు ఆకర్షితులయ్యేలా ఆధునిక డిజైన్లు, కొత్త మార్కెటింగ్ విధానాలు, డిజిటల్ వేదికల వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. తెలంగాణ చేనేత రంగాన్ని మరింత బలోపేతం చేసి, ప్రపంచ మార్కెట్లలో పోటీ పడే స్థాయికి తీసుకెళ్లేందుకు అన్ని విధాలుగా సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు

# పచ్చదనంతో పర్యావరణాన్ని కాపాడండి

- **కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి**

**హైదరాబాద్, జూన్ 6 సిరి న్యూస్:**

భావితరాల భవిష్యత్తును, పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని పచ్చదనాన్ని(గ్రీనరీ డెవలప్‌మెంట్) తప్పనిసరిగా పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న బీబీ నగర్ ఎయిమ్స్ హాస్పిటల్ ప్రాంగణంలో శనివారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ప్రస్తుతం జనాభా పెరుగుదల, కాలుష్యం వంటి అనేక కారణాల వల్ల పచ్చదనం క్రమంగా తగ్గిపోతోందని, పెరుగుతున్న ప్రజల అవసరాలను తీర్చేందుకు, మౌలిక వసతుల కల్పన కోసం కొన్ని ప్రాంతాల్లో పచ్చదనం దెబ్బతింటోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దీన్ని దృష్టిలో పెట్టుకునే ప్రధాన మంత్రి 'ఏక్ పేడ్ మా కే నామ' (అమ్మ పేరిట ఒక మొక్క) అనే గొప్ప పిలుపునిచ్చారంటూ దీని ప్రకారం ప్రతి ఒక్కరూ తమ కన్నతల్లి పేరుతో ఒక మొక్కను నాటాలని సూచించారు. శుక్రవారం జరిగిన ప్రపంచ పర్యావరణ దినోత్సవం నుండి ప్రారంభమైన ఈ మొక్కలు నాటే కార్యక్రమం ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం వరకు నిరంతరాయంగా కొనసాగుతుందన్నారు. గ్రామ పంచాయతీల్లోని యువత, వార్డు మెంబర్ల నుండి మొదలుకుని దేశ రాష్ట్రపతి వరకు, అలాగే ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థులు, యువకులు ఇలా ప్రతి ఒక్కరూ ఇందులో పాల్గొనాలని మంత్రి కిషన్‌రెడ్డి కోరారు. ప్రభుత్వ కార్యాలయాలు, పార్కులు, అడవులు లేదా మీ ఇంటి చుట్టుపక్కల ఎక్కడ ఖాళీ స్థలం ఉంటే అక్కడ అందుబాటులో ఉన్న ప్రతి చోటా మొక్కలు నాటాలన్నారు. ఈ ఏడాది చివరి వారంలో ఈ ప్రతిష్ఠాత్మక ఎయిమ్స్ హాస్పిటల్‌ను ప్రధానమంత్రి చేతుల మీదుగా ప్రజలకు అంకితం చేయాలనే ఆలోచనతో ఉన్నామన్నారు. ఈ హాస్పిటల్ పనులు జరుగుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని ఇక్కడ కూడా పచ్చదనాన్ని పెంపొందించాలనే ఉద్దేశంతో ఒక మొక్కను నాటడానికి ఈరోజు తాను ఇక్కడికి వచ్చినట్లు కిషన్‌రెడ్డి చెప్పారు.

## ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా ఎదిగిన బీజేపీ

- **తెలంగాణలో జాతీయ రహదారుల విస్తరణ**
- **రామగుండం ఎరువుల కర్మాగారాన్ని పునరుద్ధరించింది కేంద్రమే**
- **కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లి కేంద్ర పథకాలు ప్రచారం చేయాలి**
- **దీన్‌దయాళ్ ప్రశిక్షణ శిబిరంలో రామచంద్రరావు**



**హైదరాబాద్, జూన్ 6:**

రాజకీయాల్లో, సమాజంలో, ప్రపంచవ్యాప్తంగా చోటుచేసుకుంటున్న మార్పులను నిరంతరం అధ్యయనం చేస్తూ, కాలానుగుణంగా తనను తాను మలుచుకుంటూ ముందుకు సాగే పార్టీ బీజేపీ. అందుకే ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా బీజేపీ ఎదిగిందని బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు అన్నారు. యాదగిరిగుట్టలో పండిట్ దీన్ దయాళ్ ప్రశిక్షణ శిబిరంలో శనివారం ఆయన కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ ఇప్పటికే 12 సంవత్సరాల పాలన పూర్తి చేశారు. ప్రస్తుత పదవీకాలానికి ఇంకా మూడేళ్లు ఉండగా ఆ తర్వాత కూడా మరో ఐదేళ్లపాటు దేశానికి నాయకత్వం వహిస్తారని విశ్వసిస్తున్నానన్నారు. ఇటీవల హిందూ పత్రిక నిర్వహించిన ఒక కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు చాలా ఆశ్చర్యం కలిగించాయన్నారు. ఒకప్పుడు ఏబీవీపీ, ఆర్ ఎస్ ఎస్ నేపథ్యంలో పనిచేసిన వ్యక్తిగా ఆయన మాట్లాడిన తీరు చూస్తే బాధ కలుగుతుందన్నారు. ప్రధానమంత్రి ఉత్తర భారతదేశానికి చెందినవారు, రాష్ట్రపతి ఉత్తర భారతదేశానికి చెందినవారు, హోం మంత్రి ఉత్తర భారతదేశానికి చెందినవారు, రక్షణ మంత్రి ఉత్తర భారతదేశానికి చెందిన వారు. వాళ్లకు వెళ్లి నేను సెల్యూట్ చేయాలా? తనకు సిగ్గుగా ఉంటుందని అనడం బాధ కలిగించిందన్నారు. ఈ వ్యాఖ్యలు దక్షిణాదిఉత్తరాది అనే విభజన భావనను ప్రోత్సహించే విధంగా ఉన్నాయన్నారు. ఇటువంటి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు.మరి ఇదే రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ, సోనియా గాంధీని కలవడానికి, వారి ఆదేశాల మేరకు పనిచేయడానికి వెళ్లలేదా? అప్పుడు మీకు సిగ్గు అనిపించలేదా? అన్నారు. నరేంద్ర మోదీ నాయకత్వంలో తెలంగాణలో జాతీయ రహదారుల విస్తరణకు వేల కోట్ల రూపాయలు కేటాయించారు. ఇటీవల రూ.7597 కోట్లతో రెండు జాతీయ రహదారుల విస్తరణకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఆర్మూర్ – జగిత్యాల మంచిర్యాల హైవేతోపాటు జగిత్యాల కరీంనగర్ హైవేను నాలుగు వరుసలుగా విస్తరించేందుకు ఆమోదించింది. రామగుండం ఎరువుల కర్మాగారం పునరుద్ధరణ చేసింది. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీకి ఆమోదం కేంద్ర ప్రభుత్వం ఇచ్చింది. వరంగల్‌లో పీఎం మిత్ర టెక్స్‌టైల్ పార్క్‌ను మంజూరు చేసింది. జహీరాబాద్‌లో పారిశ్రామిక పార్క్ ఏర్పాటుకు సహకరించింది. పేదలకు ఉచిత బియ్యం అందిస్తోంది. ములుగులో గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసింది. శంషాబాద్ పరిసర ప్రాంతాల్లో ఏరోస్పేస్, రక్షణ రంగ పరిశ్రమలను తీసుకువచ్చింది.ఇన్ని అభివృద్ధి కార్యక్రమాలు, ఇన్ని నిధులు, ఇన్ని సంస్థలు తెలంగాణకు వచ్చిన తర్వాత కూడా కేంద్రం ఏమీ చేయలేదని రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు మాట్లాడటం అసత్య ప్రచారమేనన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్ల కాలంలో ఎన్నో వివాదాలు, అవినీతి ఆరోపణలు, కమిషన్ వ్యవహారాలు వెలుగులోకి వచ్చాయి. కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించడం తప్ప రాష్ట్ర ప్రభుత్వం చేసిన గొప్ప పని ఏమిటో చెప్పలేని పరిస్థితి ఉంది. హైదరాబాద్ నగర అభివృద్ధిలో కూడా కేంద్ర ప్రభుత్వ పాత్ర కీలకంగా ఉంది.రాబోయే రోజుల్లో జీహెచ్ఎంసీ, మల్కాజ్ గిరి, సైబరాబాద్ ప్రాంతాల్లో కేంద్ర ప్రభుత్వ పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేసి వాటిని ఆదర్శ నగరాలుగా తీర్చిదిద్దుతాం. స్వనిధి పథకం ద్వారా హైదరాబాద్ నగరంలో కూడా వేలాది మంది స్ట్రీట్ వెండర్లు లబ్ధి పొందుతున్నారు. స్వచ్ఛ భారత్, స్వనిధి, అమృత్ వంటి పథకాలతో పాటు వివిధ పథకాలతో హైదరాబాద్ నగర సుందరీకరణకు కేంద్ర ప్రభుత్వం నిరంతరం సహకరిస్తోందన్నారు. ఈ శిక్షణ తరగతులు పూర్తయ్యాక ప్రతి కార్యకర్త క్షేత్రస్థాయికి వెళ్లాలి. ప్రజల మధ్యకు వెళ్లాలి. ఎన్నికల సంఘం చేపట్టిన ఓటరు జాబితా ప్రత్యేక సవరణలో చురుకుగా పాల్గొనాలి. అర్హులైన ఓటర్ల పేర్లు నమోదు చేయించాలి. దొంగ ఓట్లను తొలగించేలా అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి అని దిశానిర్దేశం చేశారు.

## హైడ్రా ప్రజావాణికి మరో రెండు వారాల విరామం

**హైదరాబాద్ జూన్ 6 సిరి న్యూస్:**

ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం నిర్వహించే హైడ్రా ప్రజావాణి కార్యక్రమానికి మరో రెండు వారాల పాటు విరామం ప్రకటించారు. ఈ మేరకు హైడ్రా కమిషనర్ ఎ.వి. రంగనాథ్ శనివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. జూన్ 8, జూన్ 15 తేదీల్లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించబోమని స్పష్టం చేశారు.

గతంలో వచ్చిన పెండింగ్ ఫిర్యాదులను త్వరగా పరిష్కరించేందుకు మే 11 నుంచి వరుసగా నాలుగు సోమవారాల పాటు ప్రజావాణికి విరామం ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ నెల 8న కార్యక్రమాన్ని తిరిగి ప్రారంభించాలని భావించినప్పటికీ, ఇంకా కొన్ని పాత ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాల్సి ఉండటంతో గడువును మరో రెండు వారాలు పొడిగించినట్లు కమిషనర్ వెల్లడించారు.

పెండింగ్ దరఖాస్తుల పరిశీలన పూర్తయిన అనంతరం జూన్ 22 నుంచి హైడ్రా ప్రజావాణి కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని ఆయన తెలిపారు. ఈ మార్పును ఫిర్యాదుదారులు, బాధితులు గమనించాలని హైడ్రా అధికారులు కోరారు.

## 9న మైనారిటీ యువత కోసం మెగా జాబ్ మేళా

**హైదరాబాద్, జూన్ 6 సిరి న్యూస్:**

తెలంగాణ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ మైనారిటీ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో జూన్ 9, 2026న నాంపల్లిలోని రెడ్ రోజ్ ప్యాలెస్‌లో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రకటించింది. ఈ జాబ్ మేళాను మైనారిటీస్ వెల్ఫేర్, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్, గవర్నమెంట్ రిలేషన్స్ శాఖ మంత్రి జనాబ్ మహమ్మద్ అజారుద్దీన్ ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో ఐటీ, బ్యాంకింగ్, ఫైనాన్స్, హెల్త్‌కేర్, మాన్యుఫాక్చరింగ్, లాజిస్టిక్స్, హాస్పిటాలిటీ, కస్టమర్ సర్వీసెస్ తదితర రంగాలకు చెందిన 40 నుండి 50 ప్రముఖ సంస్థలు పాల్గొననున్నాయి. మైనారిటీ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించి వారిని ఆర్థికంగా బలోపేతం చేయాలన్న మంత్రి అజారుద్దీన్ సంకల్పానికి ఈ కార్యక్రమం నిదర్శనంగా నిలుస్తుందని అధికారులు తెలిపారు. అర్హత కలిగిన మైనారిటీ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. టీజీఎంఎఫ్‌సీ చైర్మన్ మొహమ్మద్ ఒబెదుల్లా కొత్వాల్ మాట్లాడుతూ ఈ జాబ్ మేళా ఉద్యోగార్థులను ప్రముఖ కంపెనీలతో అనుసంధానం చేసే ముఖ్యమైన వేదికగా నిలుస్తుందని తెలిపారు.

## మహిళా భవనాల పనుల పురోగతిని పరిశీలిస్తా

- **రోజూ వీసీలతో పనుల సమీక్ష**
- **అధికారులకు మంత్రి సీతక్క ఆదేశాలు**

**హైదరాబాద్, జూన్ 6 సిరి న్యూస్:**



గ్రామాల్లో నిర్మిస్తున్న మహిళా భవనాల నిర్మాణ పనుల పురోగతిని ప్రతి రోజూ తాను పరిశీలిస్తానని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క స్పష్టం చేశారు. భవనాల నిర్మాణ పురోగతిపై రోజువారీగా వీడియో కాన్ఫరెన్స్‌ల ద్వారా సమీక్ష నిర్వహిస్తానన్నారు. ఉపాధి హామీ పనులు, గ్రామ మహిళా సమాఖ్య భవనాల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, సెర్ప్ శాఖ అధికారులతో ఆమె శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ములుగు జిల్లా పర్యటనలో ఉన్న మంత్రి సీతక్క అక్కడి నుంచే ఉన్నతాధికారులు, జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గ్రామ మహిళా సమాఖ్య భవనాల నిర్మాణాలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల శంకుస్థాపన చేసిన ఎనిమిది వేల గ్రామ మహిళా సమాఖ్య భవనాలు కేవలం నిర్మాణాలు కాదని, మహిళల ఆత్మగౌరవానికి ప్రతీకలుగా నిలిచే ఆత్మగౌరవ భవనాలు అని పేర్కొన్నారు. వాటి నిర్మాణ పనుల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని స్పష్టం చేశారు. భవనాల నిర్మాణ పురోగతిపై నిరంతరం సమీక్ష నిర్వహించేందుకు వీడియో కాన్ఫరెన్స్‌లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రతి రోజూ పనుల పురోగతిని తాను స్వయంగా పర్యవేక్షిస్తానని, అవసరమైతే రోజువారీ వీడియో కాన్ఫరెన్స్‌ల ద్వారా సమీక్ష నిర్వహిస్తానని తెలిపారు. ప్రతి ఎంపీడీవో తమ మండలంలో ప్రోగ్రాం ఆఫీసర్‌గా వ్యవహరిస్తూ గ్రామాల్లో భవనాల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు పనుల నాణ్యత, పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న పనులపై కూడా ప్రత్యేక దృష్టి సారించి లక్ష్యాలను సాధించేలా క్షేత్రస్థాయిలో సమర్థవంతమైన అమలు జరగాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిశోర్, కమిషనర్ దివ్యా దేవరాజన్, వివిధ జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పాలనలో పాలమూరుకు ద్రోహం

- **తెలంగాణ నీటిని ఏపీకి దోచిపెట్టే కుట్ర**
- **మీడియా సమావేశంలో మాజీ మంత్రి శ్రీనివాసగౌడ్**

**మహబూబ్‌నగర్,జూన్ 6 సిరి న్యూస్:**

కాంగ్రెస్ పాలనలో అన్ని జిల్లాల కంటే ఎక్కువ నష్టం మహబూబ్‌నగర్ కు జరిగిందని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఆంధ్రా వ్యక్తిని సాగునీటి సలహాదారుగా పెట్టి తెలంగాణకు అన్యాయం చేశారని మండిపడ్డారు. ఏపీకి నీళ్లు తీసుకుపోయి పాలమూరును ఎండబెడతారంట అని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే టెండర్లు పిలిచి పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టును పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. నిన్న మంత్రి, ముఖ్యమంత్రి మాటలకు ప్రజల నుంచి స్పందన లేదని తెలిపారు. ఇప్పటికైనా చిల్లర మాటలను సీఎం రేవంత్ రెడ్డి మానుకోవాలని హితవు పలికారు. మహబూబ్‌నగర్‌లో శనివారం ఉదయం మాజీ మంత్రి లక్ష్మారెడ్డితో కలిసి శ్రీనివాస్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ సీఎం పర్యటన గురించి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రజలు ఆశతో ఎదురు చూశారని తెలిపారు. కానీ సీఎం ఇచ్చింది ఏమీ లేదని విమర్శించారు. రేవంత్ రెడ్డి వచ్చి కేసీఆర్ కట్టిన పంప్‌హౌస్‌లు, రిజర్వాయర్లను పరిశీలించిన వెళ్లారని తెలిపారు. కర్ణాటక జల దోపిడీకి మనం నిధులు ఇవ్వడమేంటని ప్రశ్నించారు. బనకచర్ల ప్రాజెక్టును సీఎం ఎందుకు వ్యతిరేకించడం లేదని నిలదీశారు. ఇప్పటికే జూరాలకు చుక్కనీరు వస్తలేదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని ప్రాజెక్టులను పడావు పెడుతున్నదని విమర్శించారు. కర్ణాటకలో చర్చలు కొలిక్కి రాకుండానే బ్యారేజి కమ్ బరాజ్‌లపై ఎలా ఏరియల్ సర్వే చేశారని సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టుకు చంద్రబాబు ఎన్‌వోసీ ఇస్తే బనకచర్లపై సీఎం రేవంత్ రెడ్డి ఆలోచిస్తానని అంటున్నారని శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. మీరు తిరిగే రిజర్వాయర్లు కట్టింది కేసీఆర్ కాదా అని సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. పాలమూరు ప్రాజెక్టు నిర్మాణానికి తట్టెడు మట్టిని కూడా రేవంత్ ప్రభుత్వం తీయలేదని విమర్శించారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును డిజైన్ చేసింది 45 కి.మీ కాలువలు అని.. అందులో 41 కి.మీ కాలువలు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే పూర్తయ్యాయని తెలిపారు. మొత్తం రూ.33,500కోట్ల పనులు పూర్తి చేశామని పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వం చేసిన పనులను కాంగ్రెస్ చేసిందని చెప్పుకుంటారా అని సీఎం రేవంత్ రెడ్డిపై మండిపడ్డారు. పాలమూరురంగారెడ్డి పనుల జాప్యానికి కారణం కాంగ్రెస్ ప్రభుత్వమని శ్రీనివాస్ గౌడ్ స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ పోరాడుతూనే ఉంటుందని అన్నారు.

**రెండున్నరేళ్లుగా తట్టెడు మట్టి తీయలేదు : మాజీ మంత్రి లక్ష్మారెడ్డి**

రెండున్నరేళ్లయినా పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టులో తట్టెడు మట్టి తీయలేదని మాజీ మంత్రి లక్ష్మారెడ్డి విమర్శించారు. ఇప్పుడు పూర్తి చేస్తామని అంటే ఎలా నమ్ముతారని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాదయాత్ర చేస్తానని అంటేనే కాంగ్రెస్ ప్రభుత్వం కదిలిందన్నారు. ఇప్పుడు అకస్మాత్తుగా పాలమూరురంగారెడ్డిపై కాంగ్రెస్ సర్కార్‌కు ప్రేమ పుట్టిందన్నారు. రెండున్నరేళ్లపాటు పాలమూరురంగారెడ్డిని పడావు పెట్టిందని మండిపడ్డారు. మహబూబ్‌నగర్‌లో మీడియాతో మాట్లాడుతూ పాలమూరు రంగారెడ్డికి రేవంత్ రెడ్డి సర్కార్ ఏం చేసిందని ప్రశ్నించారు. ప్రాజెక్టులు పూర్తి చేయాలనే చిత్తశుద్ధి కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని విమర్శించారు. 10 శాతం ప్రాజెక్టును పూర్తి చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా ఏడాది సమయం కావాలని అంటుందని తెలిపారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణ పూర్తి కాలేదని సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నాడని తెలిపారు. రేవంత్ రెడ్డి పచ్చి అబద్ధాలు చెబుతున్నాడని మండిపడ్డారు. మహబూబ్‌నగర్‌ను కాంగ్రెస్ సర్వనాశనం చేసిందని లక్ష్మారెడ్డి విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వంలోనే అభివృద్ధి జరిగిందని తెలిపారు. ఉత్తమ్ మాటలు అన్ని ఉత్తవే అని ఎద్దేవా చేశారు. పాలమూరు జిల్లా ప్రజలకు సీఎం రేవంత్ రెడ్డి మాటలపై నమ్మకం లేదని లక్ష్మారెడ్డి అన్నారు.

## త్వరలో సనత్‌నగర్ టిమ్స్ ప్రజలకు అంకితం



- **ఏర్పాట్లను సమీక్షించిన ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్**

**హైదరాబాద్, జూన్ 6 :**

సనత్‌నగర్‌లో నిర్మించిన అత్యాధునిక టిమ్స్ హాస్పిటల్‌ను త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రజలకు అంకితం చేయనున్నట్లు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లపై ఆయన శనివారం సమీక్షించారు. హాస్పిటల్‌లోని ఏ, బీ, సీ బ్లాకులను సందర్శించిన మంత్రి ఓపీ రిజిస్ట్రేషన్, ఇన్‌పేషెంట్ వార్డులు, ఎమర్జెన్సీ విభాగం, ఐసీయూలు, ఆపరేషన్ థియేటర్లు, సీటీ స్కాన్, ఎంఆర్ఐ, డయాగ్నస్టిక్స్, ల్యాబొరేటరీలు, బ్లడ్ బ్యాంక్, మెకనైజ్డ్ ల్యాండ్రీ, సెంట్రలైజ్డ్ కిచెన్, ఫార్మసీ తదితర విభాగాలను పరిశీలించారు. హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన అత్యాధునిక వైద్య పరికరాలు, మౌలిక వసతులు, వైద్య సేవల నిర్వహణ వ్యవస్థలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. హాస్పిటల్ ప్రారంభానికి ముందు పెండింగ్‌లో ఉన్న అన్ని పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆర్ అండ్ బీ, ఆరోగ్య శాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. ఓపీ కౌంటర్లు, రిజిస్ట్రేషన్ కౌంటర్లు, హెల్ప్ డెస్క్‌లు, ఫార్మసీ సేవలు, వెయిటింగ్ ఏరియాలను మరింత పటిష్టంగా ఏర్పాటు చేయాలన్నారు. సీటీ స్కాన్, ఎంఆర్ఐ, డిజిటల్ ఎక్స్‌రే, అల్ట్రా సౌండ్ తదితర ఆధునిక యంత్రాలు పూర్తిస్థాయిలో రోగులకు అందుబాటులో ఉండేలా అవసరమైన డాక్టర్లు, టెక్నీషియన్లు, సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని అధికారులకు ఆదేశించారు. గుండె సంబంధిత వ్యాధుల చికిత్సలు, అవయవ మార్పిడి శస్త్రచికిత్సలకు ఈ హాస్పిటల్‌ను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా తీర్చిదిద్దుతున్నామన్నారు. క్యాథ్‌ల్యాబ్‌లు, ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ సదుపాయాలు, అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు ప్రజలకు అత్యుత్తమ వైద్య సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. పేదలకు కార్పొరేట్ స్థాయి సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను అందించాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యానికి అనుగుణంగా సనత్‌నగర్ టిమ్స్‌ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రజలకు ప్రపంచస్థాయి వైద్య సేవలు అందించగల అత్యుత్తమ వైద్య సంస్థగా టిమ్స్ నిలవాలని అధికారులకు మంత్రి దిశానిర్దేశం చేశారు. రోగులతోపాటు వారి సహాయకులకు కూడా మెరుగైన సౌకర్యాలు కల్పించాలని, ధర్మశాల, క్యాంటీన్లు, పార్కింగ్ సదుపాయాలు, హాస్టల్ బ్లాకులు, ఇతర సహాయక సేవలను కూడా పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ నిర్వహణ, వైద్య సేవలు, మానవ వనరులు, నాన్ మెడికల్ సర్వీసులు, భద్రత, పారిశుద్ధ్యం తదితర అంశాలపై అవసరమైన సూచనలు చేశారు. సమావేశంలో ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తు, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నరేంద్ర కుమార్, నిమ్స్ డైరెక్టర్ బీరప్ప, ఆర్ అండ్ బీ, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# నీట్-2026కు పకడ్బందీ ఏర్పాట్లు

- **అధికార్లకు ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఆదేశాలు**

**హైదరాబాద్, జూన్ 6 సిరి న్యూస్:**

రాష్ట్రం నీట్ 2026 పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అన్నారు. సచివాలయం నుండి అదనపు డిజిపి మహేష్ భగవత్, పౌరసరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, ఇతర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, సిపిలు, ఇతర అధికారులతో కలిసి శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నీట్ 2026 పరీక్ష నిర్వహణ ఏర్పాట్లు, వరి ధాన్యం కొనుగోలు, జూన్ 9న సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో నిర్వహించనున్న ముఖ్యమంత్రి సభ అంశాలపై సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 21న జరగనున్న నీట్ 2026 పరీక్షకు 24 పట్టణాలలో 208 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని, 72 వేల 956 మంది విద్యార్థులు హాజరు కానున్నారని, ఇందుకు తగిన ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. పరీక్ష నిర్వహణకు పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేయాలని, రాష్ట్ర, జిల్లా సమన్వయ కమిటీలు అందుకు అనుగుణంగా పని చేయాలని తెలిపారు. ప్రభుత్వ సంస్థలలో మాత్రమే పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయాలని, పరీక్ష కేంద్రాలలో సి సి కెమెరాలు ఏర్పాటు చేయాలని, అంతర్జాతీయ యోగా దినోత్సవం దృష్ట్యా పరీక్ష నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని తెలిపారు. ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా చోంగ్తు పరీక్షకు చేపట్టిన ఏర్పాట్లపై సమావేశంలో వివరించారు. అదనపు పోలీస్ డైరెక్టర్ జనరల్ మహేష్ భగవత్ మాట్లాడుతూ, పోలీసు శాఖ, జిల్లా యంత్రాంగం మధ్య సమన్వయం అవసరమని పేర్కొన్నారు. జాతీయ పరీక్షా సంస్థ డైరెక్టర్ జనరల్ అభిషేక్ సింగ్ మాట్లాడుతూ, ఈ ఏడాది పరీక్షల కోసం మరింత కట్టుదిట్టమైన భద్రతా విధానాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. పరీక్షా ప్రశ్నాపత్రాల రవాణా కోసం తొలిసారిగా భారత వైమానిక దళం సేవలను వినియోగిస్తున్నామన్నారు.

**వరి ధాన్యం కొనుగోలుపై సమీక్ష**

రాష్ట్రంలోని పలు ప్రాంతాలలో వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో రాబోయే కొద్ది రోజుల పాటు కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సూచించారు. కోత పూర్తయిన ధాన్యాన్ని రక్షించేందుకు అవసరమైన అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని, ఇంకా ధాన్యం నిల్వ ఉన్న ప్రాంతాల్లో కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. సివిల్ సప్లైస్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 71 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేసి, ఇప్పటి వరకు 10 లక్షల 58 వేల మంది రైతుల ఖాతాలలో 13 వేల 577 కోట్ల రూపాయల కనీస మద్దతు ధర జమ చేశామన్నారు. రాబోయే రోజుల్లో ముఖ్యమంత్రి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చేపట్టనున్న పర్యటనల ఏర్పాట్లను కూడా ప్రధాన కార్యదర్శి సమీక్షించారు. రాష్ట్రంలోని ప్రతి మండల మహిళా సమాఖ్యకు 1 చొప్పున 553 బస్సులను మంజూరు చేశామని, ఈ బస్సులను జూన్ 9వ తేదీన సికింద్రాబాద్ లోని పరేడ్ గ్రౌండ్స్ లో ముఖ్యమంత్రి చేతుల మీదుగా మహిళా



సమాఖ్య సభ్యులకు లాంఛనంగా అందజేస్తామన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో డీజీపీ సీవీ ఆనంద్, పౌర సరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దానా కిషోర్, జీహెచఎంసీ కమిషనర్ కర్ణన్, సీఈఓ దివ్య, సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ముకుంద రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

# శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ప్రథమ వార్షికోత్సవంలో ప్రత్యేక పూజలు!!

- కాంగ్రెస్ పార్టీ మెదక్ జిల్లా అధికార ప్రతినిధి బండారి గంగాధర్..

**శివంపేట్ జూన్ 6( సిరి న్యూస్ )**

నర్సాపూర్ నియోజకవర్గ శివంపేట మండల్ పిల్లుట్ల గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి 1వ వార్షికోత్సవం సందర్భంగా రెండవ రోజు ఎల్లమ్మ తల్లి అమ్మవారిని మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి బండారి గంగాధర్ . దర్శించుకుని అమ్మవారిని నర్సాపూర్ నియోజకవర్గ ప్రజలు పిల్లుట్ల గ్రామం ప్రజలు సుభిక్షంగా ఉండాలని అమ్మవారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని కోరుకోవడం జరిగింది.అలాగే ఈసారి కూడా చెరువులు కుంటలు నిండి సుభిక్షంగా పంటలు పండాలని. ఆ అమ్మవారి ఆశీస్సులు ఉండాలని కోరుకోవడం జరుగుతుంది..ఈ కార్యక్రమంలో బి జి ఆర్ యువసేన అధ్యక్షులు కుమ్మరి నాగరాజు. గౌడ సంఘం అధ్యక్షులు బుర్ర పోచ గౌడ్. మాజీ ఉపసర్పంచ్ మహేష్ గౌడ్. మాజీ ఆలయ కమిటీ చైర్మన్ బాచంపల్లి శ్రీధర్ గౌడ్. బిజెపి గ్రామ కమిటీ అధ్యక్షులు బొందిల శ్రీనివాస్ గౌడ్. బుర్ర సత్యనారాయణ గౌడ్. బుర్ర రాఘవేంద్ర గౌడ్. కర్రే శ్రీకాంత్ గౌడ్. బుర్ర హరిశంకర్ గౌడ్. శివంపేట జాతీయ మానవ హక్కుల కమిటీ అధ్యక్షులు సంద్ర సుదర్శన్. పిల్లి సురేష్. గాండ్ల దాసు. పెంటమ్మరాజు సంతోష్. గౌడ సంఘం సభ్యులు తదితరులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు...,



## సంపాదకీయం

# పశ్చిమ బెంగాల్ లో టీఎంసీ సంక్షోభం !



ఇటీవల ముగిసిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం దేశవ్యాప్తంగా ప్రాంతీయ పార్టీలలో వ్యక్తమవుతున్న అసంతృప్తి, అంతర్గత కుమ్ములాటలు భారత రాజకీయాల్లో సరికొత్త గందరగోళానికి దారితీస్తున్నాయి. ముఖ్యంగా తమిళనాడు రాజకీయ ముఖచిత్రంలో ఒకవైపు ద్రవిడ పార్టీల ఆధిపత్యానికి బ్రేక్ పడటం, మరోవైపు మిత్రపక్షాల మధ్య చీలకలు స్పష్టమైన మార్పులను సూచిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పార్టీల అంతర్గత విచ్ఛిన్నం, నేతల ఫిరాయింపుల పర్వం ప్రజాస్వామ్య వ్యవస్థలో సరికొత్త సవాళ్లను విసురుతోంది. పశ్చిమ బెంగాల్ వేదికగా తృణమూల్ కాంగ్రెస్ చవిచూసిన ఊహించని పరాజయం, ఆ పార్టీలో చెలరేగిన భారీ తిరుగుబాటు తాలూకూ వేడి, జాతీయ కూటములపై తీవ్ర ప్రభావం చూపుతోంది. బెంగాల్‌లో మెజారిటీ ఎమ్మెల్యేలు నాయకత్వంపై తిరుగుబావుటా ఎగరేసి, ప్రత్యేక గ్రూపుగా ఏర్పడటం ప్రాంతీయ పార్టీల మనుగడను ప్రశ్నార్థకం చేస్తోంది. దీని ప్రభావం తమిళనాడులోని ప్రతిపక్ష కూటములు, ముఖ్యంగా ఇండియా కూటమిలోని భాగస్వామ్య పక్షాలపై బలంగా పడింది. కాంగ్రెస్, డీఎంకే మధ్య వచ్చిన విభేదాలు, సీట్ల సర్దుబాటులో అసంతృప్తి ప్రాంతీయ సమీకరణాలను పూర్తిగా మార్చేస్తున్నాయి. మరోవైపు తమిళనాడు స్థానిక రాజకీయాంశాలను పరిశీలిస్తే, తమిళ మానిల కాంగ్రెస్ (టీఎంసీ-ఎం) వంటి ప్రాంతీయ శక్తులు కూడా జాతీయ పార్టీల నీడన సొంత గుర్తింపును కోల్పోయే ప్రమాదంలో పడ్డాయి. గత ఎన్నికల్లో సొంత గుర్తును వదిలి మిత్రపక్షాల గుర్తులపై పోటీ చేయాల్సిన పరిస్థితి రావడం, ఫలితాల తర్వాత క్యాడర్‌లో తీవ్ర నైరాశ్యాన్ని నింపింది. ఏ పార్టీలోనైనా అంతర్గత ప్రజాస్వామ్యం లోపించినప్పుడు, కేవలం అధిష్టానం నిర్ణయాలకే ప్రాధాన్యత ఇచ్చినప్పుడు ఇలాంటి విచ్ఛిన్నాలు సహజంగానే మారుతాయి. పశ్చిమ బెంగాల్‌లో దాదాపు 58 మందికి పైగా టీఎంసీ ఎమ్మెల్యేలు తిరుగుబాటు చేసి ప్రత్యేక పక్షంగా అవతరించడం, లోక్‌సభలోనూ ఆ పార్టీ ఎంపీల భవిష్యత్తుపై నీలినీడలు కప్పడం వంటి పరిణామాలు 'ఇండియా' కూటమి పునాదులను కదిలించాయి. జాతీయ స్థాయిలో కాంగ్రెస్ తర్వాత రెండో అతిపెద్ద శక్తులలో ఒకటిగా ఉన్న టీఎంసీ ఇలా అంతర్గతంగా విచ్ఛిన్నం కావడం ప్రతిపక్షాల నైతిక స్థైర్యాన్ని దెబ్బతీసింది. దీని ప్రత్యక్ష ప్రభావం తమిళనాడు ఎన్నికల తదనంతర సమీకరణాలపై స్పష్టంగా పడింది. రాష్ట్రంలో సుదీర్ఘ కాలంగా కొనసాగుతున్న డీఎంకే-కాంగ్రెస్ మిత్రబంధంలో తలెత్తిన చీలకకు ఈ మార్పులే ఆజ్యం పోశాయి. క్షేత్రస్థాయి కార్యకర్తల అభీష్టాన్ని విస్మరించి తీసుకునే నిర్ణయాలు పార్టీల పతనానికి దారితీస్తాయని ప్రస్తుత సంక్షోభాలు హెచ్చరిస్తున్నాయి. రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు ఉండరనేది పాత సామెతే అయినప్పటికీ, సిద్ధాంతాలను కాలరాస్తూ కేవలం అధికారం, మనుగడే పరమావధిగా సాగుతున్న ప్రస్తుత పరిణామాలు ఓటర్లను అయోమయంలో పడేస్తున్నాయి. ఓటమి ఎదురైన వెంటనే నైతిక స్థైర్యాన్ని కోల్పోయి, రక్షణ కోసం అధికార పక్షాల వైపు చూసే ధోరణి పౌరుల్లో రాజకీయ వ్యవస్థపై నమ్మకాన్ని సడలిస్తుంది. ప్రస్తుత గందరగోళ పరిస్థితుల నుంచి పార్టీలు గట్టెక్కాలంటే తక్షణ సంస్థాగత మార్పులు అవసరం. అధిష్టానాలు మొండి వైఖరిని వీడి, అసమ్మతి నేతలతో చర్చలు జరిపి అంతర్గత సంక్షోభాన్ని పరిష్కరించుకోవాలి. కూటముల రాజకీయం కేవలం ఎన్నికల ప్రయోజనాల కోసమే కాకుండా, ప్రజాస్వామ్య విలువలను కాపాడే విధంగా ఉన్నప్పుడే ఏ పార్టీకైనా, ఏ కూటమికైనా భవిష్యత్తు ఉంటుంది.

# కల్లాల్లో ధాన్యం... రోడ్లపై రైతాంగం... అన్నదాత ఆగమాగం



- వరి పంట పండించడమే పాపమా దేవుడా...
- లారీలు రాకపోవడంతోనే తమ వడ్లు వెళ్లడం లేదని రోడ్లపై ధర్నాలు
- అధికారుల నిర్లక్ష్యంతోనే....
- కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల కన్నీటి పర్యంతం....
- చిన్నగనాపూర్ గ్రామ ప్రజలు లారీల కోసం ధర్నా...

**కొల్చారం, జూన్ 6, (సిరి న్యూస్)**

రైతులు ఆరుగాలం కష్టపడి చమట నీరు గారి పోతుంటే రైతాంగము కన్నీటి పర్యంతం చెందుతుంది. అధికారుల అలసత్వం పై ఆగ్రహించిన రైతులు రోడ్ ఎక్కవలసిన పరిస్థితులు ఎదురవుతున్నాయి. పంటలు పండించడమే పాపమా దేవుడా... కొల్చారం మండలంలోని చిన్నగనాపూర్ ప్రాథమిక సొసైటీ ముందు మెదక్ సంగారెడ్డి ప్రధాన రహదారిపై గ్రామ రైతులు లారీల కోసం శనివారం ఉదయం ధర్నా చేశారు. ఓవైపు వర్షాలు మరోవైపు లారీల కొరత ఇదేం గోస అని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తాము వరి పంట పండించడమే పాపమా దేవుడా అంటూ వారి బాధను వెల్లబోసుకున్నారు. వరి పంటను కోసి రెండు నెలలు అవుతున్నప్పటికీ కూడా ఇప్పటివరకు ధాన్యము కొనుగోలు వద్ద, లారీలు లేక తూకం వేయడం లేదని తూకం వేసిన మూడువేల బస్తాలు ఉన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లారీలు రాక ఒక తిప్పలు సాయంత్రం అయితే చాలు గుండె పగిలేలా బాధపడుతున్నామంటూ రైతులు తెలిపారు. ధర్నా చేసిన విషయము తెలుసుకున్న కొల్చారం ఎస్సై చిన్న ఘనాపూర్ గ్రామానికి చేరుకుని రైతులను శాంతించే ప్రయత్నం చేయగా రైతులు మాత్రం ఏ మాత్రం తగ్గకుండా రోడ్డుపైనే కూర్చున్నారు. వెంటనే ఎస్సై కొల్చారం తహసిల్దార్ తో మాట్లాడుతానని మీ సమస్య పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటానని అలాగే అన్లోడింగ్ అయ్యేలా లారీలు వచ్చేలా చూస్తానని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మంద నాగయ్య, బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు బొబ్బిలి సందీప్ కుమార్, డైరెక్టర్ సోమ నర్సింలు, మాజీ వార్డు మెంబర్ కమ్మరి మల్లేశం, వడ్ల ఉదయ్ కిరణ్ రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఆన్లైన్లో అపరిచితులతో జాగ్రత్తగా ఉండాలి

- మహిళల భద్రతల లక్ష్యంగా పోలీసులు
- రూ. 7 లక్షలతో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలను ప్రారంభించిన జిల్లా ఎస్పీ

**కొండాపూర్ జూన్ 06 ( సిరి న్యూస్ )**




తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లా వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో నిర్వహిస్తున్న గ్రామ సభల్లో జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది చురుకుగా పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. ఈ సందర్భంగా కొండాపూర్ మండలం గొల్లపల్లి గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో జిల్లా ఎస్పీ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ, జిల్లాలో మహిళల భద్రతకు పోలీసు శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. మహిళలపై జరుగుతున్న వివిధ రకాల నేరాలు, పోక్సో, అత్యాచార కేసుల్లో భరోసా కేంద్రం పనితీరు, మహిళల రక్షణ కోసం షీ-టీమ్స్ అందిస్తున్న సేవలు, సైబర్ నేరాల నివారణ చర్యలు, అత్యవసర సేవల వినియోగం తదితర అంశాలపై ప్రజలకు వివరించారు.సబ్‌డివిజన్ల వారీగా ఏర్పాటు చేసిన షీ-టీమ్ బృందాలు పాఠశాలలు, కళాశాలలు, బస్ స్టాండ్లు మరియు ప్రజలు రద్దీగా ఉండే ప్రాంతాల్లో గస్తీ నిర్వహిస్తూ ఆకతాయిలకు చెక్ పెడుతున్నాయి. అదే విధంగా మహిళలపై జరుగుతున్న నేరాలు, పోక్సో చట్టం, అత్యాచార నిరోధక చట్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. వివిధ పోలీసు స్టేషన్లలో నమోదైన పోక్సో, అత్యాచార కేసుల్లో బాధిత మహిళలకు అవసరమైన అన్ని రకాల మెడికో-లీగల్ సేవలను ఒకే గొడుగు కింద అందిస్తూ, బాధిత మహిళల్లో ఆత్మస్థైర్యం నింపేందుకు భరోసా కేంద్రం ద్వారా సహాయ సహకారాలు అందించడం జరుగుతోంది అన్నారు. మహిళలు పని ప్రదేశాల్లో గానీ, ఇతర ప్రాంతాల్లో గానీ ఎలాంటి సమస్యలను ఎదుర్కొన్నా వెంటనే జిల్లా షీ-టీమ్ నంబర్ 8712656772 లేదా ఉమెన్ హెల్ప్ లైన్ నెంబర్-181/ డయల్-100కు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. ప్రజలు ఎలాంటి సమస్యలు ఉన్నా నిర్భయంగా పోలీసులను సంప్రదించాలని, జిల్లా ప్రజల రక్షణలో జిల్లా పోలీసు శాఖ కట్టుబడి ఉందని అన్నారు.సైబర్ నేరాల గురించి వివరిస్తూ, తక్కువ పెట్టుబడులతో అధిక లాభాలు వస్తాయని సైబర్ నేరగాళ్లు వేసే వలలో అమాయక ప్రజలు మోసపోతున్నారని తెలిపారు. మొదట కొంత డబ్బు వచ్చినట్లు చూపించి, అనంతరం భారీ మొత్తాలు పెట్టుబడి పెట్టేలా ప్రలోభపెట్టి మోసాలకు పాల్పడుతున్నారని అన్నారు. ఆన్‌లైన్‌లో అపరిచితులతో పరిచయాలకు దూరంగా ఉండాలని, తెలియని లింకులు లేదా ఏపీకే (APK) ఫైళ్లను ఓపెన్ చేసి మోసపోవద్దని సూచించారు.పార్సిల్ లేదా కొరియర్ పేరుతో కూడా మోసాలకు పాల్పడుతున్నారని, అత్యాశకు పోయి సైబర్ నేరాల బారిన పడవద్దని హెచ్చరించారు. ముఖ్యంగా సైబర్ నేరాల బారిన పడుతున్న వారిలో విద్యావంతులే అధికంగా ఉన్నారని, సైబర్ నేరాలపై అవగాహన పెంచుకొని గ్రామ స్థాయిలో ప్రజలకు చైతన్యం కల్పించాలని కోరారు.ఈ సందర్భంగా గొల్లపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ప్రారంభించారు. సీసీ కెమెరాల ప్రాధాన్యతను వివరిస్తూ, నేరాలు జరిగిన తర్వాత వాటిని ఛేదించడానికే కాకుండా, నేరాలను ముందుగానే నివారించడంలో కూడా సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని జిల్లా ఎస్పీ తెలిపారు.ఈ కార్యక్రమాల్లో సంగారెడ్డి డిఎస్పీ సత్యయ్య గౌడ్, జడ్పీ డిప్యూటీ సీఈఓ స్వప్న,తషిల్దార్ అశోక్, ఎంపీడీఓ సౌమ్యశ్రీ,ఎంపీవో రాజ్ కుమార్,ఎస్ ఐ సోమేశ్వరి, ఏపీఎం మాణిక్యం, సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, ఉప సర్పంచ్ ప్రియాంక నర్సింలు, పంచాయతీ కార్యదర్శి,వార్డ్ సభ్యులు సత్యనారాయణ, శ్రీకాంత్, ఎల్లయ్య, ప్రజాప్రతినిధులు, మహిళలు,గ్రామస్తులు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు...





# అక్రమ షెడ్లపై అధికారుల ఉక్కు పాదం

- ప్రభుత్వ స్థలాల పరిరక్షనే ద్వేయం
- తాసిల్దార్ ఆధ్వర్యంలో కూల్చేతలు

**అమీన్ పూర్ జూన్ 6 సిరి న్యూస్**

అమీన్ పూర్ మండల పరిధిలోని బీరంగూడ గుట్ట భ్రమరాంబిక టెంపుల్ సమీపంలోని సర్వే నంబర్ 993 ప్రభుత్వ భూములను అక్రమించి నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన అక్రమ షెడ్లపై రెవెన్యూ అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. కోట్ల విలువైన భూమి స్వాధీనం, ఈ కూల్చివేతల ద్వారా అక్రమణదారుల చేతుల్లో ఉన్న కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూమిని రెవెన్యూ యంత్రాంగం తిరిగి స్వాధీనం చేసుకుంది. ఈ సందర్భంగా తాసిల్దార్ వెంకటేష్ మాట్లాడుతూ అమీన్పూర్ మండల పరిధిలోని సర్వేనెంబర్ 993 లో కొంతమంది వ్యక్తులు అక్రమంగా చొరబడి ప్రభుత్వ భూములను కబ్జ చేసి షెడ్లు నిర్మించారు.స్థానికుల సమాచారం మేరకు సిబ్బందితో కలిసి షెడ్లను పూర్తిగా నేలమట్టం చేయడం జరిగింది అని అన్నారు.ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.



# ఆర్థిక వృద్ధి రేటులో మెదక్ జిల్లా దూసుకుపోతుంది

- గడిచిన ఆర్థిక సంవత్సరం లో 5607.28 కోట్ల రుణాల పంపిణి.
- లక్ష్య సాధన లో 85.05 శాతం పూర్తి.
- పెండింగ్ దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలి.
- రైతులకు,మహిళా సంఘాలకు పెద్దపిట.
- మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ మెంచు నగేష్.

**మెదక్ జూన్,06(సిరి న్యూస్)**






గడిచిన ఆర్థిక సంవత్సరంలో 5607.28 కోట్ల రూపాయల రుణాలు పంపిణీ చేసినట్లు,లక్ష్య సాధన లో 85.05 శాతం పూర్తి చేసి జిల్లా ఆర్థిక వృద్ధి రేటులో మెదక్ జిల్లా దూసుకుపోతుందని అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు.శనివారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా స్థాయి జిల్లా స్థాయి బ్యాంకర్ల సమీక్ష సమావేశం లో (డీసీసీ, డిఎల్డిఎం) కన్వీనర్ ఎల్డిఎం బాపూజీ వివిధ బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ,ప్రభుత్వ సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులైన లబ్ధిదారులకు అందడంలో బ్యాంకులు పాత్ర అత్యంత కీలకం అని గత ఏడాది నిర్దేశించిన లక్ష్యంలో 85.05 శాతం పూర్తి చేయడం బ్యాంకర్ల పనితీరును అర్థం పడుతుంది అని వ్యవసాయం స్వయం సహాయక సంఘాలు సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమల రంగాల కు ప్రాధాన్యత నేస్తూ పంపిణీ చేసిన ఈ రుణాలు జిల్లాలో ఆర్థిక స్వాలంబనకు దోహదపడుతున్నాయన్నారు.గత ఆర్థిక సంవత్సరం లాగానే ఈ ఆర్థిక సంవత్సరం కూడా బ్యాంకర్లు మరియు జిల్లా అధికారులు సమన్వయం తో పనిచేసి 100% రుణ లక్ష్యాలను సాధించాలని ఆయన సూచించారు.రైతులు తమ పంట రుణాలను సకాలంలో రెన్యువల్ చేసుకొనేలా వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి బ్యాంకర్లు ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించాలని ఆదేశించారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ బీసీ మైనారిటీ సంక్షేమ శాఖల ద్వారా అందించే రుణాల దరఖాస్తులను పెండింగ్లో పెట్టకుండా త్వరగా పరిష్కరించాలని సూచించారు. యువతకు ఉపాధి కల్పించే పీఎం ఈజిపి పీఎం విశ్వకర్మ వంటి పథకాలపై బ్యాంకర్లు ప్రత్యేక చొరవ చూపాలని కోరారు.రికవరీపై శ్రద్ధ వహించాలి రుణాలు ఇవ్వడమే కాకుండా ఇచ్చిన రుణాలు సకాలంలో తిరిగి వసూలు అయ్యేలా చూడాలని అధికారులకు ఆయన ఆదేశించారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు రుణాలను వ్యాపారుల అభివృద్ధికి వాడుకోవాలని సకాలంలో చెల్లించి బ్యాంకు స్తంబంధాలు కలిగి ఉండాలని పిలుపునిచ్చారు.ఈ సమీక్ష సమావేశంలో ఆర్బిఐ ప్రతినిధి శ్రీనివాస్ ,ఎల్ డి ఎం బాపూజీ,నాబార్డ్ డీడీఎం కృష్ణ చైతన్య,వివిధ బ్యాంకులో ఏజీఎంలు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## సూతార్ పల్లిలో విజయవంతమైన గ్రామసభ.

**రామాయంపేట, జూన్ 6 (సిరి న్యూస్)**



రామాయంపేట మండలంలోని సుతార్ పల్లి గ్రామంలో శనివారం నాడు నూతన గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ సభ నిర్వహించారు. ఈ గ్రామ సభకు గ్రామ సర్పంచ్ మద్దూరీ సునీల్ అధ్యక్షత వహించారు.ముఖ్య అతిథులుగా ఎంపీ ఓ, రెవెన్యూ ఇన్స్పెక్టర్, అగ్రికల్చర్ ఆఫీసర్ హాజరయ్యారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి నివేదిక అంశాలు ,ప్రపంచ పర్యావరణ దినోత్సవ అంశం,తడి చెత్త పొడి చెత్త వేరు చెయ్ ప్రక్రియ అంశాలు , రానున్న వర్షాకాలం రిత్యా తీసుకోవలసిన జాగ్రత్తలుగురించి సభలో గ్రామస్తులకు చెప్పడం జరిగింది .గ్రామసభను విజయ వంతంగ ముగింపు చేయడం జరిగిందనీ సర్పంచ్ తెలిపారు.

## ఈఎస్ఐ ఆసుపత్రిలో సదుపాయాలు కల్పించాలి

### సీఐటీయూ

**రామచంద్రపురం, జూన్ 6 (సిరి న్యూస్):**



రామచంద్రపురం ఈఎస్ఐ ఆసుపత్రిలో ఐసీసీయూ, సీటీ స్కాన్, ఎంఆర్ఐ స్కాన్, అల్ట్రాసౌండ్, డిజిటల్ ఎక్స్‌రే వంటి ఆధునిక వైద్య సదుపాయాలను వెంటనే ఏర్పాటు చేయాలని సీఐటీయూ సీనియర్ నాయకుడు ఎం.డి. వాజిద్ అలీ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. రమేష్ బాబుకు వినతిపత్రం అందజేశారు.రామచంద్రపురం ఈఎస్ఐ ఆసుపత్రి పరిధిలో లక్షలాది మంది లబ్ధిదారులు ఉన్నప్పటికీ, సీటీ స్కాన్, ఎంఆర్ఐ సేవల కోసం సనత్‌నగర్ ఈఎస్ఐ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి వెళ్లాల్సి వస్తోందని ఆయన తెలిపారు. దీంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.దీర్ఘ కాలిక వ్యాధిగ్రస్తులకు అవసరమైన సూపర్ స్పెషాలిటీ మందులను రామచంద్రపురం ఆసుపత్రిలోనే అందుబాటులో ఉంచాలని, పారిశ్రామిక ప్రాంతాల్లో ఈఎస్ఐ వైద్య శిబిరాలు నిర్వహించాలని కోరారు. సమస్యల పరిష్కారానికి ఉన్నతాధికారుల అనుమతితో చర్యలు తీసుకుంటామని సూపరింటెండెంట్ డా. రమేష్ బాబు తెలిపారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ పటాన్‌చెరు ఏరియా కార్యదర్శి నాగేశ్వరరావు, మాజీ ఈఎస్ఐ బోర్డు సభ్యుడు బి. అర్జున్, నాయకులు వీరాస్వామి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## రామచంద్రపురంలో బీరప్ప దేవాలయ భూమి పూజ..

### ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్య అతిథిగా హాజరు



**రామచంద్రపురం, జూన్ 6 (సిరి న్యూస్):**

రామచంద్రపురం డివిజన్ పరిధిలోని ఈఎస్ఐ ఆసుపత్రి సమీపంలో నూతనంగా నిర్మించ తలపెట్టిన బీరప్ప స్వామి దేవాలయ నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయ నిర్మాణానికి సంపూర్ణ సహకారం అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. అలాగే స్థలానికి సంబంధించిన వివాదాలు తలెత్తకుండా బిహెచ్ఎల్ యాజమాన్యంతో చర్చించి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు అంజయ్య, పుష్ప మహేష్, సీనియర్ నాయకులు పరమేష్ యాదవ్, ఐలేష్, రాజు, కురుమ సంఘ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


## నిజాంపూర్ లో చేప ప్రసాదం పంపిణీ సర్వం సిద్ధం.

### గత వంద సంవత్సరాలుగా చేప ప్రసాదం పంపిణీ.

### ఉచితంగా అందజేస్తున్న ఆడెం బ్రదర్స్.

### ఈనెల 8న మృగశిర కార్తె, చేప ప్రసాదం పంపిణీ.

**సదాశివపేట. జూన్ 6.(సిరి న్యూస్)**



సదాశివపేట మండలంలోని నిజాంపూర్ గ్రామంలో చేప ప్రసాదం పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు ఆడెం బ్రదర్స్ తెలిపారు. గ్రామంలోని లోపలి కోట హనుమాన్ మందిరం వద్ద మృగశిర కార్తె ప్రారంభం కాగానే సాయంత్రం 8 గంటలకు చేప ప్రసాదం ఉచితంగా అందజేయనున్నట్లు వారు తెలిపారు. ప్రతి సంవత్సరం నిజాంపూర్ లో చేప మందు కోసం తెలంగాణలోని మెదక్ , సిద్దిపేట్, హైదరాబాద్ , రంగారెడ్డి , నిజామాబాద్, వరంగల్, నల్గొండతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల నుంచి చేప ప్రసాదం కోసం భారీ సంఖ్యలో హాజరవుతారని తెలిపారు. చేప ప్రసాదం ఆస్తమా , ఉబ్బసం, దగ్గు, ఎలర్జీ నివారణ కోసం ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. 65వ జాతీయ రహదారిపై ఉన్న సదాశివపేట పట్టణంలో అన్ని రాష్ట్రాల బస్సులు నిలుపుతారని అక్కడినుండి నిజాంపూర్ గ్రామానికి బస్సు ల తో పాటు ఆటోల సౌకర్యం ఉంటుందని తెలిపారు. వివరాలకు 9396880163,9652424833 , 7288866624 సెల్ నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

## గుమ్మడిదల విద్యార్థుల నిరీక్షణకు ఎప్పుడు తెరపడుతుంది..?

- విద్యార్థుల భవిష్యత్తుకు ప్రభుత్వ జూనియర్ కళాశాలే దిక్సూచి
- ప్రభుత్వ ఇంటర్ కళాశాల కోసం గుమ్మడిదల విద్యార్థుల ఎదురుచూపులు

**గుమ్మడిదల, జూన్ 6( సిరి న్యూస్ ):**



పదో తరగతి పూర్తైన తర్వాత విద్యార్థి జీవితంలో అత్యంత కీలకమైన దశ ఇంటర్మీడియట్. ఇంతకాలం ఒకే విధమైన విద్యా విధానంలో సాగిన విద్యాభ్యాసం, టెన్త్ అనంతరం వివిధ దిశల్లో పయనిస్తుంది. డాక్టర్, ఇంజనీర్ లేదా ఇతర వృత్తి రంగాల్లో స్థిరపడాలంటే ఇంటర్మీడియట్ దశలో తీసుకునే నిర్ణయాలే భవిష్యత్తును నిర్దేశిస్తాయి. ఈ నేపథ్యంలో విద్యార్థులు తమ శక్తి, సామర్థ్యాలు, లక్ష్యాలకు అనుగుణంగా సరైన కోర్సును ఎంచుకోవాల్సిన అవసరం ఉంది.

**గుమ్మడిదల పారిశ్రామికవాడలో**

గుమ్మడిదల మండలంలో ప్రభుత్వ ఇంటర్మీడియట్ కళాశాల లేకపోవడం విద్యార్థులు, తల్లిదండ్రులకు తీవ్ర ఇబ్బందులను కలిగిస్తోంది. నూతన మండలంగా ఏర్పడి సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు మాత్రం కలగానే మిగిలిపోయింది. రాష్ట్రంలోని దాదాపు ప్రతి మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు అందుబాటులో ఉన్నప్పటికీ, గుమ్మడిదల విద్యార్థులు మాత్రం ఆ సౌకర్యానికి దూరంగా ఉన్నారు.

**వ్యవసాయం, పరిశ్రమలలో పనిచేసే కార్మికుల పిల్లలే**

గుమ్మడిదల పాఠశాల ప్రాంతంలో వ్యవసాయంతో పాటు పశ్రమలలో పనిచేసే కార్మికుల పిల్లలు ఎక్కువగా ఉన్నారు. ప్రభుత్వ కళాశాల లేకపోవడంతో విద్యార్థులు సమీప పట్టణాలు, ఇతర మండలాల్లోని కళాశాలలకు వెళ్లాల్సి వస్తోంది. దీంతో ప్రతిరోజూ ప్రయాణ భారం పెరగడమే కాకుండా, ప్రైవేట్ కళాశాలల ఫీజుల భారాన్ని కూడా భరించాల్సి వస్తోంది. వ్యవసాయం, పరిశ్రమలలో పనిచేసే కార్మిక కుటుంబాలకు చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ప్రాంతానికి వచ్చిన ప్రతిసారీ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు దిశగా చర్యలు తీసుకుంటామని హామీలు ఇస్తున్నప్పటికీ, ఇప్పటి వరకు కార్యరూపం దాల్చలేదు. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రుల్లో నిరాశ నెలకొంది.


**విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని**

గుమ్మడిదల మండల విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే ప్రభుత్వ ఇంటర్మీడియట్ కళాశాలను ఏర్పాటు చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజా సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు. కళాశాల ఏర్పాటు జరిగితే పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి రావడంతో పాటు ఆర్థిక భారం కూడా గణనీయంగా తగ్గే అవకాశం ఉందని వారు కోరారు.

## ఆడపిల్లల పెళ్లిళ్లకు ప్రభుత్వం ఆర్థిక భరోసా...

- మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు
- 115 మంది లబ్ధిదారులకు 1,05 12,480 చే పంపిణీ.

**రామాయంపేట, (చిన్న శంకర0పేట) జూన్ 6 (సిరి న్యూస్)**



పేద ఆడపిల్లల పెళ్లిళ్లకు ఆర్థిక భరోసా కల్పించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు అమలు చేస్తున్నట్లు మెదక్ నియోజకవర్గ శాసన సభ్యులు డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు అన్నారు.శనివారం చిన్న శంకర0పేట మండల కేంద్రం రాదేశాం ఫంక్షన్ హాల్‌లో మండలంలోని లబ్ధిదారులకు మెదక్ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు మొత్తం 115 మంది లబ్ధిదారులకు రూ.1,05,12,480/- కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ, "రాష్ట్ర ప్రభుత్వం పేద ఆడపిల్లల పెళ్లిళ్లకు ఆర్థిక భరోసా కల్పించేందుకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోంది. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ పథకం అందేలా చర్యలు తీసుకుంటున్నాం. లబ్ధిదారులందరూ ఈ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి" అని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్యకర్తలు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

## తక్కువ సారవంతమైన భూములకు జీలుగు సాగు వరం

- పచ్చిరొట్టె ఎరువుతో నేల సారాన్ని పెంచుకోవచ్చు
- 50 శాతం సబ్సిడీపై విత్తనాల పంపిణీ

**గుమ్మడిదల, జూన్ 6( సిరి న్యూస్ ):**

తక్కువ సారవంతమైన భూములను మెరుగుపరిచేందుకు భారీగా మట్టిని తరలించి ఖర్చులు చేయడం కంటే, నేల స్వభావానికి అనుగుణంగా పచ్చిరొట్టె ఎరువుల పంటలను సాగు చేయడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. ముఖ్యంగా జీలుగు సాగు ద్వారా నేల సారాన్ని పెంచడంతో పాటు తదుపరి పంటలకు అనుకూల వాతావరణం ఏర్పడుతుందని పేర్కొంటున్నారు. జీలుగు సాగుతో నేల సారం పెరుగుతుంది. పచ్చిరొట్టె ఎరువుల కోసం సాగు చేసే పంటల్లో జీలుగు ప్రధానమైనది. నేల స్వభావాన్ని బట్టి జీలుగు సాగు చేస్తే భూమి సారవంతంగా మారడంతో పాటు తదుపరి పంటల దిగుబడులు మెరుగుపడతాయి. జీలుగు మొక్కలను పొలంలోనే కలియదున్నడం వల్ల అవి కుళ్లి సేంద్రియ ఎరువుగా మారి నేలకు పోషకాలను అందిస్తాయి. ఎకరాకు 10 నుంచి 12 కిలోల జీలుగు విత్తనాలు అవసరమవుతాయి. దుక్కిలో 20 నుంచి 30 కిలోల యూరియాను వేసిన అనంతరం విత్తనాలను చల్లాలి. మొక్కలు బాగా పెరిగేందుకు అవసరమైన మేరకు నీటిని అందించాలి. విత్తిన 25 నుంచి 30 రోజుల్లో పంట ఏపుగా పెరుగుతుంది. ఈ దశలో మొక్కలను కత్తిరించి లేదా రోటావేటర్ సహాయంతో కలియదున్నాలి. సూపర్ ఫాస్ఫేట్‌తో వేగంగా కుళ్లే అవశేషాలు జీలుగు పంటను కలియదున్నిన అనంతరం ఎకరాకు సుమారు 100 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్‌ను దుక్కిలో వేయాలి. దీని వల్ల మొక్కల అవశేషాలు త్వరగా కుళ్లి నాణ్యమైన పచ్చిరొట్టె ఎరువుగా మారతాయి. కుళ్లే దశలో పొలంలో తగినంత తేమ ఉండేలా నీటిని క్రమం తప్పకుండా అందించాలి.

**జీలుగు సాగుతో రైతులకు ఎన్నో ప్రయోజనాలు**

జీలుగు పంటను నేలలో కలియదున్నడం వల్ల సుమారు మూడు టన్నుల వరకు పచ్చిరొట్టె ఎరువు లభిస్తుంది. మొక్కల ద్వారా నేలకు సుమారు రెండు శాతం నత్రజని అందుతుంది. అదనంగా జింక్, మాంగనీస్, ఇనుము, కాల్షియం వంటి సూక్ష్మ పోషకాలు భూమిలో పెరుగుతాయి. నీటిలో కరగని పోషక మూలకాలను మొక్కలకు అందుబాటులోకి తెచ్చే సామర్థ్యం కూడా దీనికి ఉంది. నేల నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచడం, నేలలో సేంద్రియ పదార్థాల శాతాన్ని మెరుగుపరచడం, వానపాముల వంటి సహజ మిత్ర జీవుల అభివృద్ధికి తోడ్పడడం వంటి ప్రయోజనాలు కలుగుతాయి. తుంగ, గరిక వంటి కలుపు మొక్కల పెరుగుదలను కూడా జీలుగు నియంత్రిస్తుంది.

**సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి**

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు 50 శాతం సబ్సిడీపై జీలుగు విత్తనాలను అందిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి



శ్రీనివాసరావు తెలిపారు. కావలసిన రైతులు భూమి పాస్ బుక్, ఆధార్ కార్డ్ తీసుకొని వ్యవసాయ అధికారి వద్ద పర్మిట్ రాయించుకుని గుమ్మడిదల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద తీసుకొని గలరు. ఒక బస్తా రెండున్నర ఎకరాలకు సరిపోతుంది. 30 కేజీల బ్యాగు ధర 2452.50 రూపాయలు. ఆసక్తి గల రైతులు విత్తనాలను పొందాలని ఆయన సూచించారు. నేల సారాన్ని పెంచేందుకు, రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించేందుకు జీలుగు సాగును రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఎమ్మెల్యే సహకారంతో పట్టణ అభివృద్ధి

- అభివృద్ధి విషయంలో ప్రజలు సహకరించాలి.
- రామాయంపేట మున్సిపల్ చైర్మన్ గజవాడ లావణ్య నాగరాజు గుప్తా.
- విద్యుత్ సమస్యల గురించి చెప్పినా పట్టించుకోవడం లేదు.
- దురుసుగా ప్రవర్తిస్తున్నారు.
- సభలో మహిళా ఆవేదన...

**రామాయంపేట, జూన్ 6 (సిరి న్యూస్)**



మెదక్ జిల్లా రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో శనివారం వార్డు సభలు నిర్వహించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 10,11,12 వార్డులకు చెందిన వార్డు సభలు స్థానిక వైశ్య భవన్లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చైర్పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు గుప్తా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు వార్డుల్లో నెలకొన్న సమస్యలపై చర్చించారు. ముఖ్యంగా విద్యుత్ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని 12వ వార్డుకు చెందిన ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ సమస్యలు విన్నవించుకుంటే దురుసుగా ప్రవర్తిస్తున్నారని, తాము ఓటర్లను కాదా అంటూ ఒక మహిళ సభలో ప్రశ్నించారు. ఎంతోకాలంగా పురాతన విద్యుత్ స్తంభాలతో ఇబ్బంది పడుతున్నామని, ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున విద్యుత్ స్తంభాలు మార్పు చేయడమే కాకుండా సమస్యలు పరిష్కరించాలని ఈ సందర్భంగా వినతి పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ.. రామాయంపేట మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని, ప్రజా సమస్యల పరిష్కారం కోసమే వార్డు సభలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే రోహిత్ రావు సహకారంతో రామాయంపేట మున్సిపాలిటీకి అభివృద్ధి నిధులు మంజూరయ్యాయని, వేసవి ఎండల తీవ్రత కారణంగా అభివృద్ధి పనులు నిలిచిపోయాయని.. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో అభివృద్ధి పనులు వేగంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పరిసరాల పరిశుభ్రత పాటించాలని, వీధులపై చెత్త వేయవద్దని, ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రతి ఒక్కరు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ ఎ రవీందర్, వైస్ చైర్పర్సన్ పోచమ్మల నవనీత గణేష్, కౌన్సిలర్ లు గజవాడ నాగరాజు, దేవుని రంజిత్, డాకి శ్యామల స్వామి, మద్దెల మాధవి రమేష్, బైరం స్వప్న కుమార్, గూగులోతు రవి నాయక్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు చింతల యాదగిరి, జిల్లా కార్యదర్శి పోచమ్మల గణేష్, జిల్లా నాయకులు దాకి స్వామి, మున్సిపల్ మేనేజర్ రఘువరన్ , శానిటరీ ఇన్స్పెక్టర్ వనిత బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు



# పాఠశాలల ప్రారంభానికి ముందే పాఠ్యపుస్తకాల పంపిణీ

- జూన్ 12నుంచి విద్యార్థుల చేతికి పుస్తకాలు అందేలా విద్యాశాఖ చర్యలు
- ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాల పంపిణీ

**గుమ్మడిదల, జూన్ 6( సిరి న్యూస్ ):**




ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభమయ్యే నాటికే విద్యార్థులందరికీ పాఠ్యపుస్తకాలు అందేలా విద్యాశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా గుమ్మడిదల మండల కేంద్రానికి చేరుకున్న కొత్త విద్యా సంవత్సరానికి సంబంధించిన పాఠ్యపుస్తకాలను మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలకు పంపిణీ చేస్తున్నారు. పాఠశాలలు ప్రారంభమైన మొదటి రోజునే విద్యార్థులు పుస్తకాలతో విద్యాభ్యాసాన్ని ప్రారంభించాలనే లక్ష్యంతో ఈ ప్రక్రియను ముందుగానే పూర్తి చేస్తున్నారు.

**విద్యార్థులకు తొలి రోజునే పుస్తకాలు**

రాష్ట్రవ్యాప్తంగా జూన్ 12 నుంచి పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో పాఠ్యపుస్తకాలను మండల కేంద్రాలకు తరలించారు. అక్కడి నుంచి ఆయా పాఠశాలల అవసరాలకు అనుగుణంగా పంపిణీ చేపడుతున్నారు. దీంతో విద్యార్థులు పాఠశాలల ప్రారంభం రోజునే కొత్త పుస్తకాలను అందుకుని విద్యా కార్యక్రమాలను సజావుగా కొనసాగించే అవకాశం కలగనుంది.

**ప్రభుత్వ విద్య బలోపేతానికి ప్రత్యేక చర్యలు**

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను ప్రోత్సహించడంతో పాటు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా పాఠ్యపుస్తకాలను అందజేస్తోందని అధికారులు తెలిపారు. విద్యార్థులపై ఆర్థిక భారం తగ్గించడంతో పాటు ప్రతి ఒక్కరికీ సమాన విద్యా అవకాశాలు కల్పించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతోందన్నారు.

**అధికారుల పర్యవేక్షణలో**

పంపిణీ పాఠ్యపుస్తకాల పంపిణీ ప్రక్రియను విద్యాశాఖ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ప్రతి పాఠశాలకు అవసరమైన మేరకు పుస్తకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నారు. పాఠశాలలు ప్రారంభమయ్యేలోపే పంపిణీ ప్రక్రియ పూర్తిచేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. ఈ సందర్భంగా మండల విద్యాధికారి పౌలీణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థిని ప్రోత్సహించే ఉద్దేశంతో ఉచితంగా పాఠ్యపుస్తకాలను అందజేస్తోందన్నారు. విద్యార్థులు తొలి రోజునే పుస్తకాలు అందుకుని విద్యా సంవత్సరాన్ని ఉత్సాహంగా ప్రారంభించేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని తెలిపారు.

# పక్షి జీవనానికి ప్రసిద్ధి పోచారం అభయారణ్యం

- అంతరించి పోతున్న వివిధ పక్షి జాతులు.
- ప్రకృతి ప్రసాదించిన పక్షులను కాపాడాలి.
- జిల్లా అదనపు కలెక్టర్ మెంచు నగేష్ గౌడ్.

**మెదక్ జూన్,06(సిరి న్యూస్)**







ప్రకృతి పరిరక్షణ,పక్షుల సంరక్షణపై అవగాహన పెంపొందించే లక్ష్యంతో బర్డ్ వాక్ కార్యక్రమం నిర్వహించినట్లు జిల్లా అదనపు కలెక్టర్ మెంచు నగేష్ తెలిపారు.శనివారం పోచారంలోని డిబిసిలో నిర్వహించబడే బర్డ్ వాక్‌లో డీఎఫ్ఓ జోజి ఆధ్వర్యంలో అటవీశాఖ సిబ్బంది చేపట్టిన ఈ కార్యక్రమంలో మెదక్ డి పి ఆర్ ఓ రామచంద్ర రాజుతో కలిసి అదనపు కలెక్టర్ నగేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని ఈ కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించి, పోచారంలోని డిబిసిలో నాలుగు కిలోమీటర్ల బర్డ్ వాక్ లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అటవీ వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించడం జరుగుతుందని అందులో భాగంగా బర్డ్ వాక్ నిర్వహించడం జరిగిందన్నారు. పోచారం ల్యాండ్‌స్కేప్ యొక్క గొప్ప పక్షి వైవిధ్యం మరియు సహజ వారసత్వం పట్ల ప్రశంసను ప్రోత్సహించడానికి,బర్డ్ వాక్ నిర్వహించామన్నారు. పోచారం జలాశయం , అభయారణ్యం చుట్టూ ఉన్న పోచారం ప్రాంతం, వలస నీటి పక్షులు, కొంగలు, ఐబిస్‌లు, బాతులు అనేక అటవీ ప్రాంతాలతో సహా విభిన్న పక్షి జీవనానికి ప్రసిద్ధి చెందిందన్నారు.ఇది ఒక ముఖ్యమైన పక్షి వీక్షణ గమ్యస్థానంగా నిలుస్తుందనీ ప్రకృతి ప్రేమికులు, విద్యార్థులు, అధికారులు పాల్గొని వివిధ రకాల పక్షులను వీక్షించాలని , పక్షుల జీవన విధానం, వలస పక్షుల ప్రాముఖ్యత, పర్యావరణ సమతుల్యతలో వాటి పాత్ర గురించి ,పక్షుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా చెట్లు నాటడం, నీటి వనరులను కాపాడడం, పర్యావరణాన్ని పరిశుభ్రంగా ఉంచడం అవసరం అన్నారు, ప్రకృతిని దగ్గరగా ఆస్వాదిస్తూ పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించుకోవడానికి బర్డ్ వాక్ వంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎఫ్ ఆర్ ఓ లు బీట్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ దుర్మరణం.

- కోమటిపల్లి గ్రామంలో అలుముకున్న విషాదఛాయలు.
- నివాళులు అర్పించిన అడిషనల్ ఎస్పీ విక్రమ్ కుమార్ సింగ్.
- అంత్యక్రియల్లో పాల్గొని పాడె మోసిన తూప్రాన్ డిఎస్పి నరేందర్ గౌడ్, రామాయంపేట సీఐ. సైదా.

**రామాయంపేట, జూన్ 6 (సిరి న్యూస్)**





రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కానిస్టేబుల్ సంగని మహిపాల్ అంత్యక్రియలు శనివారం రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో నీ కోమటిపల్లి గ్రామంలో విషాద వాతావరణంలో నిర్వహించారు. కోమటిపల్లి గ్రామానికి చెందిన మహిపాల్ శివంపేట మండలం కేంద్రంలోని పోలీస్ స్టేషన్లో ఆయన విధులు నిర్వహిస్తున్నారు. రాత్రి విధులు ముగించుకొని తన స్వగ్రామానికి వస్తుండగా పక్కన పేట శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిపాల్ మృతి చెందారు.మహిపాల్ అకాల మరణంతో కుటుంబ సభ్యులు, బంధువులు, సహచర పోలీసు సిబ్బంది తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.మహిపాల్ భౌతికకాయానికి అడిషనల్ ఎస్పీ విక్రమ్ కుమార్ సింగ్, తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్, రామాయంపేట సీఐ సైదా పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన విధి నిర్వహణలో చూపిన క్రమశిక్షణ, సేవాభావాన్ని స్మరించుకుంటూ సంతాపం వ్యక్తం చేశారు.అనంతరం పోలీసు గౌరవ వందనం మధ్య మహిపాల్ అంత్యక్రియలు నిర్వహించారు. ప్రత్యేకంగా డీఎస్పీ నరేందర్ గౌడ్, సీఐ సైదా స్వయంగా పాడె మోసి అంతిమయాత్రలో పాల్గొనడం అందరినీ భావోద్వేగానికి గురిచేసింది. సహచరుడికి చివరి వీడ్కోలు పలుకుతూ పోలీసు అధికారులు, సిబ్బంది నివాళులర్పించారు.మహిపాల్ మృతితో కోమటిపల్లి గ్రామంలో విషాద ఛాయలు అలుముకోగా, అంతిమయాత్రలో పెద్ద సంఖ్యలో గ్రామస్తులు, బంధువులు, పోలీసు సిబ్బంది పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు..

# నిజాపూర్‌లో చెరువు మోరం అక్రమ రవాణా.

**సదాశివపేట. జూన్ 6. (సిరి న్యూస్)**





గ్రామ సర్పంచ్ అండదండలతో దందా జరుగుతోందని ఆరోపణలు దానం దక్కల చెరువు మనుగడపై గ్రామస్తుల ఆందోళన సదాశివపేట మండల పరిధిలోని నిజాపూర్ గ్రామంలో చెరువు మోరం అక్రమ రవాణా జరుగుతోందన్న ఆరోపణలు స్థానికంగా కలకలం రేపుతున్నాయి. గ్రామ పరిధిలో ఉన్న దానం దక్కల చెరువు నుండి భారీ స్థాయిలో మోరాన్ని తవ్వి ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారం గ్రామ సర్పంచ్ అండదండలతోనే సాగుతోందని స్థానికులు బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు.గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు రాత్రి వేళల్లో చెరువు ప్రాంతానికి వెళ్లి మోరాన్ని తవ్వి తరలిస్తున్నారని, దీనివల్ల చెరువు ఆకృతి దెబ్బతింటోందని గ్రామస్తులు చెబుతున్నారు. చెరువులో సహజ సిద్ధంగా ఉన్న మట్టిని అక్రమంగా తీసుకెళ్లడం వల్ల భవిష్యత్తులో చెరువు నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ప్రస్తుతం వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో చెరువులు గ్రామాలకు కీలక వనరులుగా మారుతున్నాయి. ఇలాంటి సమయంలో చెరువులను కాపాడాల్సిన బాధ్యత ఉన్నవారే అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు రావడం గ్రామస్థుల్లో తీవ్ర అసంతృప్తిని కలిగిస్తోంది. చెరువు కింద ఉన్న వ్యవసాయ భూములకు నీటి అవసరాలు తీర్చడంలో దానం దక్కల చెరువు ముఖ్య పాత్ర పోషిస్తోందని రైతులు పేర్కొంటున్నారు.గ్రామస్తుల కథనం ప్రకారం, గత కొద్ది రోజులుగా ట్రాక్టర్ల రాకపోకలు పెరిగాయని, అధికారులకు సమాచారం అందించినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు కనిపించలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు గ్రామ పెద్దలు ఈ వ్యవహారంపై రెవెన్యూ, పంచాయతీ, మైనింగ్ శాఖ అధికారులు వెంటనే విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.ఇలా మోరం తరలిస్తే మరో కొద్ది కాలంలో చెరువు ఆనవాళ్లు కూడా కనిపించవు. గ్రామ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని వెంటనే అక్రమ రవాణాను నిలిపివేయాలి అని గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు. చెరువుల పరిరక్షణలో ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్న తరుణంలో ఇలాంటి అక్రమాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చెరువులో జరుగుతున్న తవ్వకాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం ఈ అంశం నిజాపూర్ గ్రామంలో చర్చనీయాంశంగా మారింది.

# తల్లోజు ఆచారికి ఘన జన్మదిన శుభాకాంక్షలు..



**రామచంద్రపురం, జూన్ 6 (సిరి న్యూస్):**

మాజీ బీసీ కమిషన్ సభ్యులు, విశ్వకర్మ సంఘ ప్రముఖ నాయకులు తల్లోజు ఆచారి గారికి బీజేపీ సీనియర్ నాయకులు కంజర్ల కృష్ణమూర్తి ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా కంజర్ల కృష్ణమూర్తి మాట్లాడుతూ, తల్లోజు ఆచారి గారు క్రమశిక్షణకు మారుపేరుగా, ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేసే నాయకుడిగా గుర్తింపు పొందారని పేర్కొన్నారు. ప్రజలతో మమేకమై ఆపద సమయంలో అభయహస్తం ఇచ్చే ఆపద్బాంధవుడుగా ఆయన సేవలు ప్రశంసనీయమని తెలిపారు.రాజకీయంగా ఆయన మరింత ఉన్నత పదవులు అధిరోహించాలని, భవిష్యత్‌లో ప్రజాసేవలో మరింత రాణించాలని ఆకాంక్షించారు. అలాగే ఆయన ఆయురారోగ్యాలతో దీర్ఘకాలం ప్రజలకు సేవ చేయాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు

# తెల్లాపూర్‌లో ఉత్సాహంగా వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహణ..

**యువతలో క్రీడా స్ఫూర్తి పెంపొందించడమే లక్ష్యం**
**మల్లెపల్లి రాజేందర్ రెడ్డి**



**రామచంద్రపురం, జూన్ 6 (సిరి న్యూస్):**

తెల్లాపూర్ వాలీబాల్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం వాలీబాల్ టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించారు. ఈ క్రీడా పోటీలకు స్థానిక యువత నుంచి విశేష స్పందన లభించగా, ఆటగాళ్లు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు.ఈ టోర్నమెంట్‌కు బీజేపీ కిసాన్ మోర్చా సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మల్లెపల్లి రాజేందర్ రెడ్డి స్పాన్సర్‌గా వ్యవహరించి తన వంతు సహకారాన్ని అందించారు. కార్యక్రమానికి సంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షుడు గోదావరి అంజి రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులను అభినందించారు. అలాగే బి. రఘురాం రెడ్డి, ఎం. శ్రీనివాస్, ఎన్. సాయినాథ్ రెడ్డి, ఎన్. శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొని టోర్నమెంట్‌కు తమ మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ యువత క్రీడల్లో చురుకుగా పాల్గొనడం వల్ల శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, జట్టు భావన పెంపొందుతాయని పేర్కొన్నారు. ఇలాంటి క్రీడా కార్యక్రమాలు యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు ప్రతిభను వెలికితీయడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు.టోర్నమెంట్ విజయవంతం కావడానికి కృషి చేసిన నిర్వాహకులు శివ యాదవ్, సాయి యాదవ్, వికాస్ రెడ్డి, అభి రెడ్డి, మనోజ్ రెడ్డి, యశ్వంత్ యాదవ్‌లను అతిథులు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో స్థానిక యువత, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బీసీ ఉద్యమ నాయకుడు జానయ్యకు పరామర్శ

**మునిపల్లి, జూన్ 6 (న్యూస్):**



గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బీసీ ఉద్యమ నాయకుడు వట్టే జానయ్య యాదవ్‌ను తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర కార్యదర్శి రమేష్ యాదవ్ శనివారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా రమేష్ యాదవ్ మాట్లాడుతూ జానయ్య యాదవ్‌కు మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి ఎలాంటి నిర్లక్ష్యం జరగకుండా చూడాలని అన్నారు.జానయ్య యాదవ్ త్వరగా కోలుకుని తిరిగి ప్రజా ఉద్యమాల్లో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు.

# ట్రాక్టర్ దగ్ధంతో ఒక్కసారిగా ఉలిక్కిపడ్డ శేరిల్లా గ్రామం

**వెల్దుర్తి,జూన్ 06 (సిరి న్యూస్):**



వెల్దుర్తి మండలం శేరిల్ల గ్రామంలో వ్యవసాయ క్షేత్రంలో ఉన్న ట్రాక్టర్ కు గుర్తు తెలియని దుండగులు శుక్రవారం రాత్రి నిప్పు పెట్టగా ట్రాక్టర్ పూర్తిగా దగ్ధమైంది. గ్రామానికి చెందిన సల్ల మహేష్ అనే రైతు తన వ్యవసాయ పొలం వద్ద వ్యవసాయ పనులు అనంతరం శుక్రవారం రాత్రి ట్రాక్టర్ ను నిలిపి ఇంటికి వచ్చారు. శనివారం ఉదయం వెళ్లి చూసేసరికి ట్రాక్టర్ పూర్తిగా దగ్ధమైందని గ్రామస్తులు తెలపడంతో అక్కడికి చేరుకున్న మహేష్ కుటుంబ సభ్యులు దగ్ధమైన ట్రాక్టర్ చూసి ఒకసారి కుప్పకూలారు. పెద్ద ఎత్తున మంటలు చెలరేగి ట్రాక్టర్ ఇంజన్ భాగం పూర్తిగా దగ్ధమైంది అని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# వడదెబ్బతో తస్మాత్ జాగ్రత్త

- అప్రమత్తతే శ్రీరామరక్ష
- రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకే ముప్పు

**గుమ్మడిదల, సిరి న్యూస్ :**


రోజురోజుకూ భానుడు ఉగ్రరూపం దాల్చుతున్నాడు. ఉదయం 9 గంటలు దాటకముందే ఇంటి నుంచి బయటకు అడుగుపెట్టలేని పరిస్థితులు నెలకొంటున్నాయి. ఎండల తీవ్రతతో రహదారులు నిప్పుల కొలిమిలా మారిపోతుండగా, సూర్యుడి ప్రతాపానికి ప్రజలు అల్లాడిపోతున్నారు. ఎన్నడూ లేనివిధంగా ఈసారి అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో ప్రజల్లో ఆందోళన, భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కూలీలు, ఉపాధి హామీ కూలీల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. రోజువారీ కూలీ పనులపై ఆధారపడే కార్మికులు తప్పనిసరిగా ఎండలో పనిచేయాల్సిన పరిస్థితి ఉండటంతో వారి కుటుంబ సభ్యులు సైతం ఆందోళన చెందుతున్నారు. ఉదయం పనికి వెళ్లిన వారు సురక్షితంగా ఇంటికి చేరుకునే వరకు కుటుంబ సభ్యుల్లో భయం నెలకొంటోంది. ప్రతిరోజూ ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. తగిన జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాన్ని నివారించవచ్చు. నిర్లక్ష్యం చేస్తే వడదెబ్బ బారిన పడి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం కూడా లేకపోలేదు.

**వడదెబ్బపై అప్రమత్తత తప్పనిసరి**

వేసవి కాలంలో శరీర ఉష్ణోగ్రత అసాధారణంగా పెరగడం వల్ల వడదెబ్బకు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. శరీరంలో నీటి శాతం తగ్గిపోవడం, అధిక చెమటలు పట్టడం, అలసట, తలనొప్పి, వాంతులు, కళ్లు తిరగడం, స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి. వృద్ధులు, చిన్నారులు, గర్భిణీ స్త్రీలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. అధిక ఉష్ణోగ్రతల కారణంగా శరీరంలో లవణాల సమతుల్యత దెబ్బతింటుంది. అందువల్ల తరచూ నీరు తాగడంతో పాటు ఉప్పు, పంచదార కలిపిన ద్రావణాలు, ఓఆర్ఎస్ ద్రావణాలు తీసుకోవడం మంచిది. మజ్జిగ, నిమ్మరసం, కొబ్బరి నీరు వంటి పానీయాలు శరీరాన్ని చల్లగా ఉంచడంలో ఎంతో ఉపయోగపడతాయి.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇవే**

వడదెబ్బ బారిన పడకుండా ఉండేందుకు ప్రజలు కొన్ని జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలి. సాధ్యమైనంత వరకు మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లకుండా ఉండాలి. బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు, టోపీ లేదా తలకు రుమాలు కట్టుకోవాలి. వదులుగా ఉండే పత్తి లేదా ఖద్దరు దుస్తులు ధరించడం మంచిది.



ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌తో పాటు ముఖాన్ని రక్షించేలా గుడ్డ లేదా స్కార్ఫ్ ఉపయోగించాలి. ఆహారాన్ని ఒకేసారి ఎక్కువగా తీసుకోవడం కంటే తక్కువ మోతాదులో పలుమార్లు తీసుకోవడం ఆరోగ్యానికి మేలు చేస్తుంది. కారంగా, నూనె ఎక్కువగా ఉండే ఆహారాలకు దూరంగా ఉండాలి. తాజా పండ్లు, కూరగాయలు, ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. ఎండలో ఎక్కువసేపు నిలబడటం, శారీరక శ్రమ చేయడం తగ్గించాలి.

**కూలీలు, పిల్లలు ప్రత్యేక శ్రద్ధ వహించాలి**

ఉపాధి హామీ కూలీలు, వ్యవసాయ కూలీలు, నిర్మాణ రంగ కార్మికులు ఉదయం వేళల్లోనే పనులు ప్రారంభించి ఉదయం 10 గంటల లోపు లేదా ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పనులను పూర్తి చేసుకునేలా చర్యలు తీసుకోవాలి. తిరిగి అవసరమైతే సాయంత్రం 5 గంటల తర్వాత మాత్రమే పనులకు వెళ్లడం మంచిది. మధ్యాహ్న సమయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ ఎండలో పనిచేయకుండా జాగ్రత్త పడాలి. ఇక వేసవి సెలవులు కావడంతో పిల్లలు ఆటలకు ఎక్కువ సమయం కేటాయిస్తుంటారు. అయితే ప్రస్తుతం నమోదవుతున్న అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో మధ్యాహ్న సమయంలో బయట ఆడుకోవడం ప్రమాదకరం. ఉదయం లేదా సాయంత్రం వేళల్లో మాత్రమే ఆటపాటలకు ప్రాధాన్యత ఇవ్వాలి. ఎండలో ఎక్కువసేపు గడపడం వల్ల వడదెబ్బ, డీహైడ్రేషన్ వంటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. ప్రజలందరూ అప్రమత్తంగా ఉంటూ తగిన జాగ్రత్తలు పాటిస్తే వడదెబ్బ నుంచి రక్షణ పొందవచ్చు. ఎండ తీవ్రతను తక్కువగా అంచనా వేయకుండా ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా ప్రాణాపాయ పరిస్థితులను నివారించవచ్చు.

# ప్రగతి ప్రణాళికలతోనే వార్డుల సమగ్ర అభివృద్ధి

- ప్రజలకు సంక్షేమ పాలనను అందిస్తాం
- మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్
- దోమడుగు వార్డులో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక గ్రామసభ

**గుమ్మడిదల, జూన్ 6 (సిరి న్యూస్):**

ప్రగతి ప్రణాళికలతోనే వార్డుల సమగ్ర అభివృద్ధి చేపడుతున్నట్లు గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా శనివారం మున్సిపాలిటీ పరిధిలోని దోమడుగు 3, 9, 18, 19 వార్డులకు సంబంధించి గ్రామ వార్డు కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ దశరథ్ ఆధ్వర్యంలో, చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ అధ్యక్షతన వార్డు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు తమ వార్డుల్లో నెలకొన్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. మంచినీటి సరఫరా, డ్రైనేజీ, వీధిదీపాలు, రోడ్లు, రహదారులు తదితర సమస్యలను ప్రస్తావించారు. అలాగే వ్యవసాయ సమస్యలకు సంబంధించిన అంశాలను కూడా అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతో మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తున్నామని, వార్డు సభల్లో ప్రజలు ప్రస్తావించిన సమస్యలను ప్రాధాన్యత ఆధారంగా పరిష్కరిస్తామని చెప్పారు. మున్సిపాలిటీలో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు సంక్షేమ కార్యక్రమాల అమలుకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. గ్రామంలోని నల్లకుంట చెరువును మినీ ట్యాంక్ బండ్‌గా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నామని, త్వరలోనే పనులు ప్రారంభించేలా కృషి




చేస్తున్నామని చెప్పారు. ప్రజల సహకారంతో గుమ్మడిదల మున్సిపాలిటీని ఆదర్శవంతమైన మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు కృషి కొనసాగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ పరమేశం, వైస్ చైర్మన్ చిమ్ముల సంధ్యా, వార్డు కౌన్సిలర్లు మద్ది సోనీ, వరలక్ష్మి , రాజశేఖర్, రాజి రెడ్డి, వివిధ శాఖల అధికారులు, పార్టీల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# నర్సాపూర్ కేంద్రంలో తెలంగాణ రక్షణ సేన జండా ఆవిష్కరణ

**నర్సాపూర్ జూన్ 06, (సిరి న్యూస్)**

తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితక్క ఆదేశాల మేరకు జెండా పండుగ కార్యక్రమంలో భాగంగా శనివారం నర్సాపూర్ నియోజకవర్గం కేంద్రంలోని చౌరస్తాలో నర్సాపూర్ నియోజకర్గ ఇంచార్ గణేష్ కుమార్ ముదిరాజ్ ఆధ్వర్యంలో టిఆర్ఎస్ పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మెదక్ జిల్లా ఇంచార్జి చంద్ర శేఖర్ తెలంగాణ రక్షణ సేన పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ అబ్జర్వర్ అశ్వత్ ముఖ్యఅతిథిగా హాజరై పార్టీ జెండాను ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు అనంతరం గణేష్ మాట్లాడుతూ తెలంగాణ లో ప్రజలకు జరుగుతున్న అన్యాయలు, అభివృద్ధిని ప్రజా గొంతుకై ప్రశ్నించేందుకే రాష్ట్రం లో తెలంగాణ రక్షణ సేన పార్టీని కల్వకుంట్ల కవిత



ఆవిర్భావం చేసిందని పార్టీ సిద్ధాంతాలను ప్రజలలోకి తీసుకెళ్లి తెలంగాణ అభివృద్ధి కోసం తెలంగాణ రక్షణ సేన పార్టీ ప్రతి కార్యకర్త కృషి చేయాలని. పిలుపునిచ్చారు. రాష్ట్రంలో అవినీతి పేరుకుపోయిందని ప్రజలు అనేక సమస్యలకు గుర్రై అధికారుల ప్రజా ప్రతినిధుల చుట్టు ప్రధక్షణాలు చేస్తున్న పట్టించుకోవడం లేదని ఆరోపించారు.సమాజ నిర్మాణంలో భాగంగా సమస్యలు ఎక్కడున్నా ప్రశ్నించడమే కాకుండా పరిష్క రించే వరకు మా పార్టీ ప్రజల పక్షాన పోరాటం చేస్తుందని అన్నారు ఈ కార్యక్రమంలో , మెదక్ నియో జకవర్గ ఇంచార్జ్ రమేష్ గౌడ్, మెదక్ నియోజకవర్గ ఇన్చార్జి బట్టి అజయ్ మహిళా నాయకురాలు అపర్ణ,రమేష్ రామచంద్రారెడ్డి ,తిరుపతి రెడ్డి చంద్ర పవన్ రెడ్డి ప్రవీణ్ యాదవ్ నవీన్ రాము ముదిరాజ్ టౌన్ టీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ కేవల్ నందకిషోర్ కిట్టు అశోక్ జిల్లా, నియోజకవర్గ స్థాయి నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# టీబీ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి


- టీబీ నిర్మూలనే లక్ష్యం
- చైర్మన్ కుమార్ గౌడ్

**గుమ్మడిదల, జూన్ 6( సిరి న్యూస్):**

టీబీ వ్యాధిని పూర్తిస్థాయిలో అరికట్టడమే లక్ష్యంగా గ్రామాల్లో ఎక్స్‌రే పరీక్షల శిబిరాలను నిర్వహిస్తున్నట్లు గుమ్మడిదల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మధుకర్ తెలిపారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని దోమడుగు వార్డులో శనివారం ఉచిత ఎక్స్‌రే పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ మధుకర్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత ప్రజల్లో టీబీ వ్యాధిని ముందస్తుగా గుర్తించి సకాలంలో చికిత్స అందించడం ద్వారా వ్యాధి వ్యాప్తిని నియంత్రించవచ్చని అన్నారు. టీబీ లక్షణాలు ఉన్నవారు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. శిబిరంలో మొత్తం 57 మందికి ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు.

**టీబీ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి**

టీబీ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని చైర్మన్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు టీబీ నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాయని అన్నారు. ప్రజలు ఆరోగ్య పరీక్షలను సద్వినియోగం చేసుకొని ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. టీబీ వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే వైద్య పరీక్షలు చేయించుకొని చికిత్స పొందాలని కోరారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న ఆరోగ్య శిబిరాలకు ప్రజలు సహకరించి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. వ్యాధిని ముందుగానే గుర్తిస్తే పూర్తిగా నయం చేయడం సాధ్యమవుతుంది. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సేవలను ప్రజలు వినియోగించుకోవాలి. ప్రతి



కుటుంబం ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి. టీబీపై అపోహలు వీడి లక్షణాలు కనిపిస్తే వెంటనే పరీక్షలు చేయించుకోవాలి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దశరథ, తహసిల్దార్ పరమేశం, మున్సిపల్ వైస్ చైర్మన్ చిమ్ముల సంధ్య, వార్డు కౌన్సిలర్లు మద్ది సోనీ, వరలక్ష్మి , రాజశేఖర్, రాజిరెడ్డి, రమేష్, హెచ్ఈఓ శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ గోవర్దన్ గౌడ్, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

## పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించండి

**గుమ్మడిదల, జూన్ 6( సిరి న్యూస్):**




బడి బయట ఉన్న ప్రతి చిన్నారిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని, ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని గుమ్మడిదల మండల పరిధిలోని మంబాపూర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయ్‌కుమార్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బడిబాట కార్యక్రమంలో భాగంగా శనివారం గ్రామంలో ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంలో తల్లిదండ్రులు భాగస్వాములు కావాలని కోరారు. తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ప్రభుత్వం అందిస్తున్న విద్యా అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ప్రభుత్వం విద్యార్థులకు ఉచిత మధ్యాహ్న భోజనం, రెండు జతల యూనిఫాంలు, ఉచిత పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు అందిస్తోందని తెలిపారు. అదేవిధంగా ఈ విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు అల్పాహార పథకాన్ని కూడా అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు.ప్రైవేటు పాఠశాలలకు ఏమాత్రం తీసిపోకుండా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన జరుగుతోందని, ప్రతిభావంతులైన ఉపాధ్యాయులచే విద్యార్థులకు బోధన అందిస్తున్నామని చెప్పారు. బడి బయట ఉన్న పిల్లలందరినీ సమీప ప్రభుత్వ పాఠశాలల్లో, భవిత కేంద్రాల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుజాత, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ ఇస్తారి గంగ, గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ధర్మ రక్షణ కోసమే రథయాత్ర..!

**ఝరాసంఘం, జూన్ 6(సిరిన్యూస్)**



సనాతన ధర్మ రక్షణ, దేవాలయాల పరిరక్షణ కోసం తెలుగు రాష్ట్రాల్లో "ఆది శంకరాచార్య వైభవం" పేరుతో రథయాత్ర నిర్వహిస్తున్నట్లు బర్దిపూర్ ఆశ్రమ పీఠాధిపతి అవధూత గిరి మహారాజ్ పేర్కొన్నారు. శనివారం ఆశ్రమ ఆవరణంలో రథయాత్రకు సంబంధించిన బుక్‌లెట్‌ను విడుదల చేశారు. గత ఏప్రిల్ 21న హైదరాబాద్‌లోని తాడ్‌బండ్ హనుమాన్ దేవాలయంలో మంత్రి శ్రీధర్ బాబు చేతుల మీదుగా ఈ యాత్ర ప్రారంభమైందని, త్వరలోనే ఉమ్మడి మెదక్ జిల్లాలో ప్రవేశించనున్నట్లు తెలిపారు.ప్రతి గ్రామంలో ధర్మం, దేవాలయాలు, భారతీయ సంస్కృతి–సంప్రదాయాల పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించడమే రథయాత్ర ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. అలాగే, ఆదిశంకరాచార్యుల విగ్రహాల ఏర్పాటుకు సంబంధించిన కార్యక్రమాలు ముమ్మరంగా కొనసాగుతున్నట్లు తెలిపారు. హిందూ ధర్మం సత్యం, అహింస, దయ, సేవ, పరస్పర గౌరవం వంటి విలువలను బోధిస్తుందని, సమాజంలో నైతిక విలువలు పెంపొందించడంలో ధర్మం కీలక పాత్ర పోషిస్తుందని అవధూత గిరి మహారాజ్ అన్నారు.ఈ కార్యక్రమంలో హైదరాబాద్ వేదభారతి వ్యవస్థాపకులు డాక్టర్ రేమెళ్ల అవధానులు, ఆధ్యాత్మికవేత్త ప్రసాద్, ఆనందగిరి మాత, నందినిగిరి మాత, వైదిక పాఠశాల విద్యార్థులు, భక్తులు పాల్గొన్నారు.ధర్మం గురించి రెండు మూడు వాక్యాలు వార్తలో చేర్చేలా సులభంగా రాశాను. ఇది వార్తా శైలికి అనుగుణంగా ఉంటుంది.

# వరి కొనుగోలు ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలి

- మరో రెండు రోజుల్లో రుతుపవనాలు రాష్ట్రాన్ని తాకనున్నాయి.
- ఈ నెల 9న పరేడ్ గ్రౌండ్ లో మండల మహిళా సమాఖ్య సంఘాలకు ఆర్టిసి బస్సుల ప్రారంభోత్సవం.
- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు.


**మెదక్జూన్,06(సిరి న్యూస్)**



మరో రెండు రోజుల్లో రుతుపవనాలు తెలంగాణ రాష్ట్రాన్ని తాకనున్న నేపథ్యంలో జిల్లాలో వరి కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు కలెక్టర్లను అదేశించారు.వరి కొనుగోలు ప్రక్రియ, జూన్ 9న జరిగే మండల మహిళా సమాఖ్య సభ్యులకు ఆర్టీసీ బస్సుల ప్రారంభోత్సవ కార్యక్రమంపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి డిఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్, డిఆర్డిఏ పిడి శ్రీనివాసరావు, డి ఎం సివిల్ సప్లై నిత్యానంద్, వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి అదనపు కలెక్టర్ నగేష్, హాజరయ్యారు.జిల్లాలోని అన్ని కొనుగోలు కేంద్రాల నుంచి తూకం వేసిన వడ్లు వెనువెంటనే లారీల్లో మిల్లులు, గోదాములకు తరలించాలన్నారు. రెండు మూడు రోజుల్లో కొనుగోలు ప్రక్రియ పూర్తి అయ్యే విధంగా చూడాలని సూచించారు.జూన్ 9వ తేదీన హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్ లో మండల మహిళా సమాఖ్యలకు ఆర్టీసీ బస్సుల పంపిణీ కార్యక్రమం ఉంటుందన్నారు.జిల్లాల్లోని అన్ని బస్సులు ఆయా మండలాల నుంచి మహిళా సంఘాల సభ్యులను తీసుకొని సాయంత్రం 4 గంటల లోపల హైదరాబాద్ లోని పరేడ్ గ్రౌండ్ కి చేరుకునే విధంగా చూడాలని సూచించారు. మహిళలకు మార్గమధ్యలో భోజనాలు, తాగు నీరు, తదితర మౌలిక సదుపాయాలు కల్పించే విధంగా ప్రణాళికలు చేసుకోవాలన్నారు.నీట్ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించాలని, కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. ఎక్కడా కూడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అన్ని జాగ్రత్తలు పాటించాలన్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో విద్యా శాఖ ఏడీ శ్రీనివాస్, డీసీఓ కరుణ, ఏసిపి భీం శర్మ, ఇతర సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రైతులు గమనించాలి

**తూప్రాన్ జూన్ 6 సిరి న్యూస్**




తూప్రాన్ డివిజన్ లోని ఆరు మండలాల పరిధిలోని 87 వడ్ల కొనుగోలు కేంద్రాలు (1) తూప్రాన్ (2)మనోహరాబాద్ (3) వెల్దుర్తి (4) మాసాయిపేట (5) చేగుంట (6) నార్సింగ్ కేంద్రాలు ఉండగా శనివారం 33 వడ్ల కొనుగోలు కేంద్రాలు క్లోజ్ అయినవి తూప్రాన్.8 నార్సింగ్.6 మాసాయిపేట్.2 వెల్దుర్తి.5 చేగుంట.12. క్లోజ్ అయ్యాయని బ్యాలెన్స్.54గు కొనుగోలు కేంద్రాలలో కొనసాగుతున్నాయని వర్షాలు పడే అవకాశాలు ఉన్నందున ధాన్యం చివరి దశకు చేరుకున్నందున రైతులు జాగ్రత్తగా ఉండి వెంట వెంటనే కొనుగోలు కేంద్రాల వద్దకు ధాన్యం తీసుకురావాలని తూప్రాన్ ఆర్ డి ఓ జయ చంద్రారెడ్డి తెలిపారు

# హీరోయిన్లను నిందించడం ఆపండి..



కన్నడ బ్యూటీ ఆషికా రంగనాథ్ తెలుగులో కూడా పలు సినిమాల్లో నటించి మంచి గుర్తింపు తెచ్చుకుంది. ప్రస్తుతం తెలుగు, తమిళం, కన్నడ భాషల్లో బిజీగా ఉన్న ఈ నటి, మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న 'విశ్వంభర' చిత్రంలో కీలక పాత్రలో కనిపించనుంది. ఎంత బిజీగా ఉన్నప్పటికీ సోషల్ మీడియాలోనూ యాక్టివ్‌గా ఉంటూ పలు విషయాలపై తనదైన శైలిలో రియాక్ట్ అవుతోంది. తాజాగా ఆషికా ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టిన ఒక పోస్ట్ సినిమా ఇండస్ట్రీలో పెద్ద దుమారం రేపుతోంది. మూవీస్‌లో హీరోయిన్ల పాత్రలు, వారిపై వచ్చే విమర్శల గురించి ఆమె చాలా ఓపెన్‌గా మాట్లాడింది. హీరోయిన్ పాత్ర సరిగ్గా లేనప్పుడు విమర్శకులు నటీమణులపైనే నిందలు వేస్తారని ఆషికా రంగనాథ్ అన్నారు. "కథ రాసేటప్పుడే మహిళా పాత్రలను పక్కన పెట్టేయడం లేదా వాటిని సరిగ్గా డిజైన్ చేయకపోవడం అసలు సమస్య. అంతే తప్ప నటీమణుల తప్పు ఏమీ లేదు. డైరెక్టర్లు తమకు ఇచ్చిన పరిధిలోనే వాళ్ళు నటిస్తారు. రామ్ చరణ్ లేదా జూనియర్ ఎన్టీఆర్ వంటి పెద్ద స్టార్ల సరసన కేవలం డబ్బు కోసమే హీరోయిన్లు నటిస్తున్నారని కొందరు విమర్శిస్తుంటారు.

కానీ ఈ పెద్ద సినిమాల వెనుక ఉండే బిజినెస్ మార్కెట్ గురించి ఎవరూ ఆలోచించరు. ఇక నుంచి అయినా నిందించడం ఆపండి" అని ఆమె చెప్పారు. తెలుగు వంటి పెద్ద పాన్-ఇండియా సినిమాల్లో నటించడం అనేది హీరోయిన్లకు తమ నటనను నిరూపించుకునే అవకాశం కంటే, కెరీర్‌లో పైకి ఎదగడానికి ఒక ప్లాన్ లాంటిదని ఆషికా అభిప్రాయపడ్డారు. "భారీ యాక్షన్ సినిమాల్లో హీరోయిన్ పాత్ర కేవలం గ్లామర్ బొమ్మ లాగా మాత్రమే మారిపోతోంది. ఆమె పాత్రకు ఒక ప్రత్యేకమైన గుర్తింపు ఇవ్వడం కంటే, హీరో ఇమేజ్‌ను మరింత పెంచేలాగే ఆ పాత్రలను జాగ్రత్తగా రాస్తున్నారు" అని ఆషికా రాసుకొచ్చారు. ఆషికా రంగనాథ్ చేసిన ఈ కామెంట్స్ ఇప్పుడు సినీ ఇండస్ట్రీలో దుమారం రేపుతున్నాయి.

## నాగవంశీకి అనుకోని అదృష్టం.. గట్టి జాక్‌పాట్ తగిలిందిగా



టాలీవుడ్ యంగ్ ప్రొడ్యూసర్ నాగ వంశీ గురించి ప్రత్యేకంగా పరిచయం అవసరం లేదు. ఆయన ఇప్పటివరకు ఎన్నో సినిమాలను నిర్మించి, వాటిలో అనేక విజయాలు సాధించి భారీ లాభాలను పొందారు. అయితే ఇటీవల ఆయన నిర్మించిన కొన్ని చిత్రాలు బాక్స్ ఆఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో ఫలితాలు ఇవ్వలేకపోయాయి. ఈ నేపథ్యంలో ఆయనకు ఒక సినిమా ద్వారా అనుకోకుండా పెద్ద లాభాలు దక్కుతున్నట్లు సమాచారం. తమిళ నటుడు సూర్య తాజాగా 'కరుప్పు' అనే చిత్రంలో హీరోగా నటించారు.

ఈ సినిమాలో హీరోయిన్‌గా త్రిష నటించగా, దర్శకత్వం ఆర్. జె. బాలాజీ వహించారు. సూర్య గతంలో చేసిన కొన్ని సినిమాలు వరుసగా ఫ్లాప్ కావడంతో పాటు, ఈ మూవీ ట్రైలర్ కూడా పెద్దగా ఆకట్టుకోలేదు. దీంతో విడుదలకు ముందు ఈ సినిమాపై పెద్దగా అంచనాలు లేవు. అయితే విడుదలైన తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఈ సినిమా ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన పొందుతూ, 300 కోట్లకు పైగా వసూళ్లు సాధించి భారీ విజయాన్ని నమోదు చేసింది. ప్రస్తుతం కూడా మంచి కలెక్షన్లు రాబడుతోంది.

ఈ విజయంతో సూర్య తదుపరి సినిమాలపై అంచనాలు పెరిగాయి. ప్రస్తుతం సూర్య, నాగ వంశీ నిర్మాణంలో రూపొందుతున్న 'విశ్వనాథ్ అండ్ సన్స్' చిత్రంలో నటిస్తున్నారు. ఈ సినిమాకు వెంకీ అట్లూరి దర్శకత్వం వహిస్తున్నారు. 'కరుప్పు' భారీ విజయం సాధించడంతో 'విశ్వనాథ్ అండ్ సన్స్'పై కూడా భారీ అంచనాలు ఏర్పడ్డాయి. దీంతో ఈ సినిమా అన్ని రకాల హక్కులకు ముందుగా ఊహించిన దానికంటే ఎక్కువ ఆఫర్లు వస్తున్నట్లు సమాచారం. దీంతో నాగ వంశీకి అనుకోని అదృష్టం కలిసి వచ్చిందని ఇండస్ట్రీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.



## సమాజంలో జరిగే విషయాలకు సినిమాలను నిందించొద్దు

సినిమా అంటేనే కేవలం కల్పిత కథ అని.. అందులోని తప్పొప్పులు నిర్ణయించుకునే పూర్తి విచక్షణ మనపైనే ఉంటుందన్నారు నటి అనసూయ (Anasuya). సమాజంలో జరిగే విషయాలకు సినిమాలతో ముడిపెట్టొద్దని అన్నారు. చిత్రరంగంపై బాధ్యత, సృజనాత్మక స్వేచ్ఛ గురించి ఆమె సుదీర్ఘ పోస్ట్ పెట్టారు.

"ఒకప్పటి కథలలో నైతికత కనిపించేది. హీరో పాత్రలు స్ఫూర్తిదాయకంగా ఉండేవి. విలన్ పాత్రలు మనం అనుకరించకూడదు అనిపించేలా ఉండేవి. ఈ రోజుల్లో తెరకెక్కే కథల్లో ఈ స్పష్టత లోపిస్తోంది. పాత్రను గొప్పగా చూపించడం కోసం దర్శకులు ఈ గందరగోళాన్ని సృష్టిస్తున్నారు. ఒక కథను తెరకెక్కిస్తున్నామంటే.. దాని ప్రభావం ఎలా ఉంటుందనే దానిలో టెక్నికల్ టీమ్ నుంచి దర్శక నిర్మాతలు, నటీనటులు, చివరకు ప్రేక్షకులు కూడా కీలక పాత్రధారులే. అందుకే సినిమా ఎప్పుడూ బాధ్యతాయుతంగా ఉండాలి. సృజనాత్మకత విషయంలో వచ్చిన భేదాభిప్రాయాల వల్ల నేను కొన్ని షోల నుంచి వైదొలిగిన సందర్భాలూ ఉన్నాయి. దానివల్ల నా ప్రతిభకు తగిన అవకాశాలు రావడంలో ఇబ్బందులూ ఎదుర్కొన్నా. అంత కష్టంలోనూ నా సిద్ధాంతాల కోసమే నిలబడ్డాను" అని అనసూయ చెప్పారు."సృజనాత్మక స్వేచ్ఛ అనేది చాలా అవసరం. అదే సమయంలో సామాజిక స్పృహ ఉండటం కూడా అంతే ముఖ్యం. సినిమాలు సమాజాన్ని మంచి మార్గంలో ముందుకు నడిపించాలని ఆశించకూడదు. అలాగని సమాజంపై ఎలాంటి ప్రభావం చూపవని కూడా అనుకోకూడదు. సమాజంలో జరిగే ప్రతి విషయానికి సినిమాను నిందించలేం. సోషల్ మీడియాలో చాలామంది ముందుకువచ్చి ఇలాంటి విషయాలపై చర్చలు పెట్టడం, కథల్లో పాత్రలను చూపించే విధానాలను ప్రశ్నించడం, విమర్శనాత్మకంగా ఆలోచించడాన్ని చూస్తుంటే నాకు నిజంగా సంతోషంగా ఉంది. అవసరమైనప్పుడు తప్పులను ప్రశ్నించడం అంటే సృజనాత్మకతపై దాడి చేయడం కాదు, అది సమాజంలో అవగాహన పెంచడం మాత్రమే" అని అనసూయ వివరించారు.

# హిట్ ఉమెన్ వచ్చేసింది

"గత 25రోజుల్లో ఇది మూడో హత్య. కానీ నగరానికి ఈ విషయం గురించి అవసరం లేదు. పోలీసులు, మీడియా దగ్గర సమాధానాలు లేవు. కానీ నేను చెప్తా ఆ హత్యల గురించి.. మా అక్కే హంతకురాలు" అని చెప్తోంది ఓ అమ్మాయి. మరి తన సోదరి హంతకురాలిగా ఎందుకు మారిందో తెలుసుకోవాలంటే 'బేబీ డూ డై డూ' సినిమా చూడాల్సిందే. బాలీవుడ్ కథానాయిక హ్యూమా ఖురేషీ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రమిది. దీనికి నాచికేత్ సమంత్ దర్శకత్వం వహిస్తున్నారు. సలీమ్ సిబ్లింగ్స్ సంస్థ నిర్మిస్తోంది. తాజాగా "మా హిట్ ఉమెన్ వచ్చేసింది" అనే వ్యాఖ్యతో ఈ సినిమా నుంచి గ్లింప్స్‌ను ఇన్‌స్టా వేదికగా పంచుకుంది హ్యూమా. ఇందులో హంతకురాలిగా... సరికొత్త అవతారంలో కనిపిస్తూ ఆకట్టుకుంటోందామె. వచ్చే నెల 3న ప్రేక్షకుల ముందుకు రానుందీ చిత్రం.



## ఆహారాన్ని కాదు.. విషాన్ని పండిస్తున్నాం'

'కల్తీ ఆహారం తిని అస్వస్థకు గురైన విద్యార్థులు', 'ఓ ప్రముఖ హోటల్‌లో కల్తీ నెయ్యితో ఆహార పదార్థాల తయారీ'.. ఈ మధ్య కాలంలో ఇలాంటి ఎన్నో వార్తల్ని మన చూస్తూనే ఉన్నాం. ఈ రోజుల్లో వంటింట్లో వాడే నిత్యావసర సరుకుల నుంచి పిల్లలు తాగే పాల వరకూ ప్రతిదీ కల్తీనే. ఇప్పుడిదే అంశాన్ని తెరపైకి తీసుకురాబోతుంది కథానాయిక కాజల్. ఆమె, శ్రేయాస్ తల్పాడే ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'ది ఇండియా స్టోరీ'. చెట్టన్ డీకే దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ సినిమా టీజర్‌ను ఇన్‌స్టా వేదికగా విడుదల చేసింది చిత్రబృందం. 'సంఖ్యలు బహిరంగంగానే ఉన్నాయి. పరిణామాలు స్పష్టంగానే కనిపిస్తున్నాయి. అయినా కూడా నిజం ఇంకా దాగి ఉన్నట్లు ఎందుకనిపిస్తోంద'నే వ్యాఖ్యను జోడించింది. పురుగు మందులను వినియోగించడం వల్ల ఎలాంటి నష్టాలు జరుగుతున్నాయి? కల్తీ ఆహార సమస్య ఎంత మంది ప్రాణాలను బలితీసుకుంటుందనే అంశాల ఆధారంగా ఈ చిత్రాన్ని తీర్చిదిద్దుతున్నారు. "ఆహారాన్ని కాదు.. విషాన్ని పండిస్తున్నాం', 'ప్రతి ఏడాది 10లక్షల మందికి పైగా చనిపోతున్నారు".. అంటూ సాగుతున్న ఈ టీజర్ సినీప్రియుల్ని ఆకట్టుకుంటోంది. జులై 24న థియేటర్లలోకి రాబోతుందీ చిత్రం. ఇందులో న్యాయవాదిగా కనిపించనుంది కాజల్.



## జాన్వీ కపూర్ పాత్రపై డైరెక్టర్ బుచ్చిబాబు సంచలన వ్యాఖ్యల


మెగా పవర్‌స్టార్ రామ్ చరణ్, టాలెంటెడ్ డైరెక్టర్ బుచ్చిబాబు సన కాంబినేషన్‌లో వచ్చిన 'పెద్ది' చిత్రం బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతోంది. భారీ అంచనాలతో థియేటర్లలోకి వచ్చిన ఈ రస్టిక్ హై ఎనర్జీ డ్రామా కలెక్షన్ల వర్షం కురిపిస్తున్నప్పటికీ, సినిమాకు సంబంధించిన ఒక ఆసక్తికరమైన చర్చ ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ జాన్వీ కపూర్ క్యారెక్టరైజేషన్, ఆమెను స్క్రీన్‌పై చూపించిన విధానంపై ప్రేక్షకుల నుండి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా ఈ వివాదంపై దర్శకుడు బుచ్చిబాబు స్పందిస్తూ సంచలన వ్యాఖ్యలు చేశారు.

సినిమాలో జాన్వీ కపూర్ పాత్ర ప్రెజెంటేషన్ చుట్టూ జరుగుతున్న చర్చపై బుచ్చిబాబు ఓ ఇంటర్వ్యూలో ఓపెన్ అయ్యారు. కొంతమంది ప్రేక్షకుల నుండి ఈ స్థాయిలో ప్రతికూల స్పందన వస్తుందని తాను అస్సలు ఊహించలేదని ఆయన అంగీకరించారు. సినిమాలో జాన్వీ పాత్ర కేవలం ఒక కమర్షియల్, గ్లామరస్ హంగులకే పరిమితమైందని, కొన్ని సీన్స్‌లో ఆమెను మితిమీరిన గ్లామరస్‌గా చూపించారంటూ ఒక వర్గం ప్రేక్షకులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై



బుచ్చిబాబు మాట్లాడుతూ... "రామ్ చర
జాన్వీ కపూర్ మధ్య ఒక ఆహ్లాదకరమైన, ఆ
పట్టించే రొమాంటిక్ ట్రాక్‌ను చూపించాల
మా ముఖ్య ఉద్దేశం. 'పెద్ది' ఒక పల్లెటూరి నే
థ్యంతో సాగే హైవోల్టేజ్ డ్రామా. ఆ కథాంశాని
సినిమా మూడ్‌కు తగినట్లుగానే జాన్వీ పాత్ర
డిజైన్ చేశాం. ఎవరినీ తక్కువ చేసి చూపించ
నే ఉద్దేశం మాకు లేదు, వివాదాలు సృష్టించ
మా లక్ష్యం కాదు" అని స్పష్టం చేశారు. ఇ
నా రెండో సినిమా రాబోయే సినిమాలలో
విషయం మీద కేర్ తీసుకుంటాను అని చె
కొచ్చారు.

## రామాయణ, వారణాసి సినిమాల బడ్జెట్‌పై మనోజ్ భాజ్‌పేయి సంచలన వ్యాఖ్యలు



బాలీవుడ్ స్టార్ నటుడు మనోజ్ బాజ్‌పేయి ప్రధాన పాత్రలో నటించిన లేటెస్ట్ ఫైనాన్షియల్ థ్రిల్లర్ 'గవర్నర్' జూన్ 12న విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన భారీ ప్రాజెక్ట్స్ రామాయణ, వారణాసిలపై వివాదాస్పద కామెంట్స్ చేసి వార్తల్లో నిలిచారు. ఎస్. ఎస్. రాజమౌళిమహేష్ బాబుల 'వారణాసి' (రూ. 1400 కోట్లు), రణ్‌బీర్ కపూర్ 'రామాయణ' (రూ. 4000 కోట్లు) వంటి అత్యంత భారీ బడ్జెట్‌పై మనోజ్ బాజ్‌పేయి స్పందిస్తూ.. ఇదంతా కేవలం ఒక పీఆర్ ఎత్తుగడ మాత్రమేనని కొట్టిపారేశారు. గత 15 ఏళ్ల నుంచి ఇండస్ట్రీలో ఇలాంటి నెంబర్ల హడావుడిని తాను చూస్తున్నానని చెప్పారు. సినిమా అనేది పూర్తిగా నిర్మాతకు సంబంధించిన వ్యాపారమని, ఎంత ఖర్చు పెట్టాలి.. ఎంత వెనక్కి రాబట్టాలి అనేది కేవలం మేకర్స్ వ్యక్తిగత విషయమని అన్నారు. సాధారణ ప్రేక్షకులకు ఈ బడ్జెట్ లెక్కలతో ఎలాంటి సంబంధం లేదని, ఒక సినిమా చూశాక అది నచ్చిందా లేదా అనేదే ప్రేక్షకుడికి ముఖ్యం కావాలని ఆయన అభిప్రాయపడ్డారు.

ఈ మధ్య కాలంలో సినిమా బిజినెస్ ట్రెండ్ ఎంతగా మారిపోయిందంటే.. చివరికి ఎయిర్‌పోర్టులో తనను కలిసే సామాన్య జనం కూడా మూవీ కథ గురించి కాకుండా, ఎన్ని కోట్లు వసూలు చేసింది... బాక్సాఫీసు కలెక్షన్స్ ఎంతొచ్చాయి అనే విషయాల గురించే మాట్లాడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రూ. 500 కోట్లు లేదా రూ. 600 కోట్ల బడ్జెట్ పెట్టి సినిమా తీస్తే అందులోంచి ఒక్క రూపాయి కూడా ప్రేక్షకుల జేబుల్లోకి లేదా వారి బ్యాంక్ ఖాతాల్లోకి వెళ్లదని, ఆ డబ్బు అంతా నిర్మాత ఖాతాకే చెందుతుందని స్పష్టం చేశారు. కాబట్టి కలెక్షన్ల లెక్కలు పక్కనపెట్టి, కేవలం కంటెంట్ బాగుందా లేదా అనే కోణంలోనే సినిమాను చూడాలని అన్నారు. ప్రస్తుతం మనోజ్ బాజ్‌పేయి చేసిన ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. అయితే ఈ వ్యాఖ్యలపై నెటిజన్లు భిన్నంగా స్పందిస్తున్నారు. మనోజ్ బాజ్‌పేయి నటించిన 'గవర్నర్' సినిమాకు మార్కెట్లో ఆశించినంత స్థాయిలో బజ్ ఏర్పడలేదని, అందుకే నెటిజన్ల దృష్టిని ఆకర్షించడానికి, తన సినిమా ప్రమోషన్ కోసం రాజమౌళి, రణ్‌బీర్ కపూర్ వంటి టాప్ సెలబ్రిటీల పెద్ద ప్రాజెక్టులను టార్గెట్ చేస్తూ ఆయన ఇలాంటి కామెంట్స్ చేశారంటూ కొందరు విమర్శిస్తున్నారు.

The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY editor BADHE JAYASHREE.